# ఎవరు ఎలా మాట్లాడతారు?

(భారతంలో రాయబారాలు)



ఉషశ్రీ

# శ్రీ ఉషశ్రీ

పండితుల కర్మాగారంగా ప్రసిద్ధి పొందిన పశ్చిమగోదారి జిల్లా, కాకరపర్రులో 1928లో జన్మించిన శ్రీ ఉషశ్రీకి తల్లి కాశీ అన్నపూర్ణమ్మ, తండ్రి ఉపన్యాస సార్వభౌమ, పురాణవాచస్పతి బ్రహ్మశ్రీ పురాణపండ రామమూర్తి గారలే ప్రథమ గురువులు.

కవీ, కథకుడూ, నాటకకర్తా, ఆధునిక వ్యాస వాల్మీకిగా పేరుపొందిన ఉషశ్రీ 1965లో ఆకాశవాణిలో ప్రవేశించి, సూటిగా, లక్ష్యంవైపుకి దూసుకోయే బాణం వంటి తన వాక్కుతో 1973 నుండి దశాబ్దం పైగా ఎందరికో ధర్మ సందేహాలు తీర్చారు. రామాయణ మహాభారతాలని మథించి, తన మధుర గంభీర గళంతో అశేష జనావళికి జ్ఞానసుధను పంచారు. ఉపన్యాసాన్ని ఒక కళగా రూపొందించి రామాయణ మహాభారతోపన్యాసాలతో యావదాంధ్రదేశాన్నీ ఉర్రూతలూగించారు. రామాయణ భారతాలు అందించే మానవత్వపు విలువలూ, సంస్కృతీ, వైభవాలూ యువతరం గుండెలో నాటుకొని, వారి ప్రవర్తనలో అవి ప్రతిఫలించి సమాజం సుఖశాంతులకూ, ప్రేమానురాగాలకూ నిలయమై వాసయోగ్యం కావాలన్నది ఆయన ఆకాంక్ష. తెలుగునాట భారత, భాగవత, రామాయణాలు లేని ఇల్లు ఉండకూడదనేది విద్యార్థి దశనుండీ శ్రీ ఉషశ్రీ లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా 1950లలో తన తండ్రిగారు తలపెట్టిన బృహత్కార్యంలో భాగంగా వ్యాస భారతాన్ని ఆమూలాగ్రం ఆంధ్రీకరించి అచ్చువేసే కార్యక్రమానికి సంపాదకుడుగా మొదలుపెట్టిన ప్రయాణం 1990లో పాంచభౌతిక దేహాన్ని విడిచిపెట్టే నాటి వరకూ కొనసాగించి, జీవితాన్ని తన లక్ష్యసాధనకే అంకితం చేశారు. ఆకాశవాణి (విజయవాడ)ని ఆయన లక్ష్య సాధనకి అనువయిన, అసలయిన మాధ్యమంగా అనుగ్రహించాడు ఆయన నమ్మిన పరమేశ్వరుడు.

మానవజాతి సర్వకాలాలలోనూ సుఖశాంతులతో మనుగడ సాగించడానికి అవసరమయిన విశేష గ్రంథాలని ప్రతిపాదిస్తూ ఆయన రాసిన రామాయణ భారత భాగవతాలు గత నలభై సంవత్సరాలుగా స్వంత ప్రచురణ సంస్థలు - భారత ప్రచురణలు, ఉషశ్రీ మిషన్‌ల ద్వారా, తి.తి.దే. వారి ద్వారా, ఇతర ప్రచురణ సంస్థల ద్వారా లక్షల సంఖ్యలో పాఠకులకు చేరాయి, చేరుతూనే వున్నాయి.

వారు తన గంభీరగళంతో చెప్పిన రామాయణ,భారత, భాగవతాలు (సిడి.లు, యుట్యూబ్) దేవాలయాలలోనూ, గృహాలలోనూ, వాహనాలలోనూ యావత్ ప్రపంచంలోని తెలుగువారు నేటికీ విని తరిస్తున్నారు.

తన జీవితాన్ని (1928-1990) కావ్యత్రయ ప్రాచుర్యానికి అంకితం చేసిన శ్రీ ఉషశ్రీ కలం, గళం - అమరం.

www.ushasri.org.

# ఎవరు ఎలా మాట్లాడతారు?

## (భారతంలో రాయబారాలు)

ఉషశ్రీ

*ప్రచురణ :*

**ఉషశ్రీ మిషన్**

రేడియో ఆర్టిస్ట్స్ కాలనీ, విజయవాడ - 520 008

**ఎవరు ఎలా మాట్లాడతారు ?**
భారతంలో రాయబారాలు
ఉషశ్రీ

ప్రచురణ : సెప్టెంబర్ 2015

కవర్ డిజైన్ : వరప్రసాద్

ప్రతులకు :
ఉషశ్రీ మిషన్, విజయవాడ
8008551231, 9848113681, 9912477763
హైదరాబాద్ – 80085 99901
విశాలాంధ్ర, నవోదయ, కినిగె.కామ్

ముద్రణ :
శ్రీశ్రీ ప్రింటర్స్,
విజయవాడ – 2
సెల్ : 9490634849

వెల : 50/–

# ఎవరు ఎలా మాట్లాడతారు?

(భారతంలో రాయబారాలు)


| | | |
|---|---|---|
| | ఇందులో లేనిది ఏముంది | 5 |
| 1. | మధ్యవర్తిని పంపుతున్నారా? | |
| 2. | ఇలా మాట్లాడకూడదట | 7 |
| 3. | రాయబారులకు గురుతుల్యుడు ? | 10 |
| 4. | మృదువుగా, పదునుగా | 12 |
| 5. | ధర్మాధర్మాలు ? | 14 |
| 6. | విఫలమైనా సఫలం | 16 |
| 7. | మాటల్లో తనకు తానే సాటి | 20 |
| 8. | సంకోచమెరుగని వివేకం | 23 |
| 9. | మాటల మాటున రాజనీతి | 27 |
| 10. | ఏ తీరున బోధించాలి? | 29 |
| 11. | ప్రతి ఆడపిల్లా ఇలా కావాలి | 32 |
| 12. | కుటుంబ జీవన ధర్మం | 35 |
| 13. | తగదిది... తగదిది | 37 |
| 14. | అమ్మ ఏం చెప్పింది? | 39 |
| 15. | పనికి ... ఫలితంతో పనిలేదు. | 41 |
| 16. | హితంగా హితవు | 44 |
| 17. | వినకుంటే చెడేరు | 48 |
| 18. | ప్రయత్నం ఆపకు | 50 |
| | ఇందులో లేనిది ఉందా? | 52 |

# రూపాంతరం

భారత మహేతిహాసం వేల ఏళ్ళ క్రితమే కాదు, నేటికీ జరుగుతున్నదే. ఆ మహేతిహాసాన్ని నిత్య జీవితంలో ఎలా అన్వయించుకోవాలో తెలియచేయడానికి కడవరకూ నీ కలం, గళం అంకితం చేశావు. నువ్వు ఇహాన్ని వదలి పాతిక సంవత్సరాలయినా నీ లక్ష్యసాధన పావనగంగలా సాగుతూనే వుంది (నీ పుస్తకాలు, సి.డి.ల ద్వారా) నాన్నా. "నేనుసైతం" అంటూ యధాశక్తి మేమూ భాగం పంచుకునే ప్రయత్నం చేస్తున్నాం. నువ్వు అసంపూర్ణంగా వదలిన రామాయణంలో హనుమంతుడు (ఎవరితో ఎలా మాట్లాడాలి?) పూర్తి చేసి, మూడుసార్లు పునర్ముద్రించాం...

నీ తుదిశ్వాస వరకూ "ఉదయం" దినపత్రికలో ధారవాహికగా వచ్చిన "భారతంలో రాయబారాలు"కి కాలానుగుణంగా చేసిన రూపాంతరమే ఈ "ఎవరు ఎలా మాట్లాడతారు?" భారతం ఉద్యోగపర్వంలోని ప్రత్యేక సన్నివేశాలలో ఎవరు ఎలా మాట్లాడారో తెలుసుకుని వ్యక్తిత్వ వికాసం చేసుకోవాలనే నీ లక్ష్యాన్ని కొనసాగించడానికి చేసే చిన్ని ప్రయత్నం...

నీ పెద్దమ్మాయి

**గాయత్రీదేవి**

# ఇందులో లేనిది ఏముంది?

**ధర్మే చార్థేచ కామేచ**
**మోక్షేచ భరతర్షభ**
**యదిహాస్తి తదన్యత్ర**
**యన్నే హా స్తిన తత్క్వచిత్ !!**

మానవజాతి మహేతిహాసంగా మహాభారతాన్ని అందించిన వ్యాసమునిచంద్రుడు దేశ, కాల, జాతి, మత భేదాలు లేకుండా నిఖిల మానవ కళ్యాణ దృష్టితో పండిత, పామర, బాల, వృద్ధ రంజకమైన కథచెపుతూ, దానిలో, ధర్మ, అర్ధ, కామ, మోక్షాలనే పురుషార్ధాలు నిక్షిప్తం చేశాడు.

ఈ పురుషార్ధాలను సంపూర్ణంగా భారత సంహితలో పొందుపరిచాననీ, ఇందులో లేనిది లేదని దీనిలో ఉన్నదే ఎక్కడయినా, ఎప్పుడయినా ఉంటుందనీ ఘోషించాడు. ఇంతమాట అంతకుముందు పలికినవారు లేరు. ఆ తరువాత వారికి పలకగల సత్తాలేదు.

మానవుడు ఏ దేశంలో పుట్టినా, ఏ జాతి సంప్రదాయాన్ని అనుసరించినా, ఏ మతానికి తలవంచినా ధర్మార్ధ కామ మోక్షాలేవానిని మానవునిగా నిలుపుతాయి.

ఇందులో ధర్మ, మోక్ష కవచ బంధితములై అర్ధకామాలు సాధించాలనే భారతీయ దార్శనికులతో నిఖిల దేశాల మేధావులు ఏకీభవించారు. ఈ మార్గాన్ని కథాబద్ధంచేసి, ధర్మ మోక్షాలను ప్రబోధించే ప్రథమ ప్రబంధం భారతం.

ధర్మ మార్గాన అర్ధ సముపార్జనం చేసి, ధర్మబద్ధంగా కామసేవనం సాగించేవారికి మోక్షం అరచేతి అరటిపండు అయి తీరుతుందని భారతం ప్రవచించింది.

అయితే ధర్మ, మోక్ష విషయాలను అందించడానికి శృతి, స్మృతులూ, తత్వ శాస్త్రాలూ వున్నాయి. అర్ధ కామ ప్రతిపాదనకే మరో గ్రంథం అవసరం అయింది. అందుకే భారతం అవతరించింది.

అర్థం అంటే డబ్బు, సంపద అని తెలుసు అర్థ సంపాదనకు సామాన్యునికి ఏవో వృత్తులుంటాయి. పాలకులకు వేరే మార్గాలుంటాయి. ఆ మార్గాలను బోధించే దానిని అర్థశాస్త్రంగా కౌటిల్యుడు అందించాడు. ఇక్కడ అర్థశాస్త్రం సామ్రాజ్యానికీ, చక్రవర్తులకూ సంబంధించినవి. ఇందులోనే రాజనీతి ఉన్నది. రాజనీతిలో రాయబారం అగ్రశ్రేణిలో నిలుస్తుంది. ఇరుగు పొరుగు దేశాలతో, ఆ దేశాల పాలకులతో నడిపే వ్యవహారాలన్నీ రాయబారుల ద్వారానే సాగుతాయి అవి ఎలా సాగాలో అర్థశాస్త్రం సూత్రాలతో బోధిస్తుంది. అలాకాక ఆ సూత్రానికి వ్యాఖ్యగా రాయబారుల గాథలతో వ్యాసులవారు భారతంలో రాజనీతిని ఎలా బోధించారో ఈ వ్యాసాలలో ముందు చూద్దాం.

❊ ❊ ❊

అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగిశాయి.

ఉత్తర అభిమన్యుల కళ్యాణ మహోత్సవం బంధుబాంధవ సమక్షంలో శోభామయంగా నడిచింది.

అనంతరం కృష్ణుని సూచనమేరకు, పాండవుల రాయబారిగా ద్రుపద పురోహితుని పంపడానికి నిశ్చయించారు. పెళ్ళికి వచ్చిన బంధువులందరూ యుద్ధ సన్నాహాలు సాగించడానికి తమ తమ నగరాలు చేరారు.

ద్రుపదుడు ధర్మరాజుతో సంప్రదించి తన పురోహితుని రావించి!

**హితుడవు మతిమంతుడవు**
**చతురవచన కోవిదుడవు**
**సమయజ్ఞుడ వున్నత వంశ వర్ధనుడ**
**వింగిత వేదివి నెచ్చెలివి సుకృతి వట్లగుటన్**

ఈ మాటలక్రమం సావధానంగా పరిశీలించండి. ముందుగా హితుడవు అన్నాడు. అంటే మెరమెచ్చులకోసం రాజుతో కల్లబొల్లి మాటలాడి తన పని చూసుకునే వాడుకాడు. రాజు శ్రేయస్సుకోరి ప్రియంకాకపోయినా హితవు చెప్పేవాడు.

అనంతరం మతిమంతుడవు అన్నాడు.

తీరిగ్గా కూర్చుని 'హితోపదేశం చేసేవాడు మాత్రమేకాదు. ధీశాలి, దానికితోడు చతురవచోనిధి ఎదుటి వారితో చక్కగా మాట్లాడగలవాడు.

సమయజ్ఞుడవు. అన్నిటినీ మించినది కాలజ్ఞానం. ఎప్పుడు ఎలా వ్యవహరించాలో తెలిసినవాడు.

ఉన్నత వంశీయుడు. తరతరాలుగా పేరు ప్రతిష్టలున్న వంశంలో పుట్టినవాడు. నీచ కార్యాలకు దిగడు, ధన లోభంతో ఆత్మీయులకు హాని తలపెట్టడు పరులను హింసించే ప్రవృత్తి ఉండదు.

చివరగా ఇంగితవేదివి, నెచ్చెలివి, సుకృతివి అన్నాడు. మనం మాట్లాడేటప్పుడు ఎదుటివారి మనస్సు ఎలా వున్నదో గ్రహించే శక్తి ఉండాలి. నెచ్చెలి చిన్ననాటి నుండీ ఒకరికొకరు సన్నిహితంగా వుండడం వల్ల వాని అంతరంగం తెలుస్తుంది.

సుకృతి ఎప్పుడూ మంచి పనులు చేసేవాడు.

ఇన్ని లక్షణాలున్నవాడు రాయబారిగా వెళ్ళాలి. అదీ భారత సంహిత చేసిన ఉపదేశం. దీన్ని మనసులో ఉంచుకుని రాయబారులను నియమించుకోవాలి.

ఇక్కడ మనం గుర్తుంచుకోవలసినది

ద్రుపదుడు ఇలా మాట్లాడాడా! అని కాదు, రాజనీతిని అధ్యయనం చేసేటప్పుడు రాయబారికి ఉండవలసిన లక్షణాలేమిటో స్పష్టం చేస్తున్నది భారతం అని.

పైగా మనం రాయబారిని పంపేటప్పుడు ఎంత మర్యాదగా సంభాషించాలో కూడా చెపుతుంది.

అలా ప్రశంసించినప్పుడు అవతలి వ్యక్తి ఎంత గంభీరంగా, నిపుణంగా తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తాడో ఊహించడానికి చెప్పిన పాఠం ఇది.

## ఇలా మాట్లాడ కూడదట !

ద్రుపద పురోహితుడు సాగించిన రాయబారం, తిక్కనగారి భాషలో తిలకించండి.

* * *

హస్తినాపురం చేరాడు.

ఉచితరీతిని ధృతరాష్ట్రుని దర్శించాడు.

కృప, ద్రోణ, విదుర, భీష్ములను వారి వారి భవనాలలో దర్శించాడు. దుర్యోధనుని కూడా వాని భవనంలోనే చూశాడు. ఇన్నీ అయ్యాక ఒకనాడు కురు సభా భవనంలో ప్రవేశిస్తాడు. ఇది పూర్వరంగం.

వెడుతూనే తన రాయబారాన్ని వారికి వినిపించలేదు. కొన్నాళ్ళు గడిచాయి. అందరినీ దర్శించాడు కుశల ప్రశ్నలు సాగించాడు. వారి వారి అభిప్రాయాలు తెలుసుకున్నాడు. ఈ లోపునే వారూ, వీరూ దేశంలోని మిత్ర చక్రవర్తుల దగ్గరకు తమ దూతలను పంపి రానున్న సంగ్రామానికి సేనలు సమీకరిస్తున్నారు. అందుకు తగిన వ్యవధి ఇవ్వడానికే ఈ రాయబారి కాలయాపన చేశాడు.

ఇటు రాయబారం నడుపుతూనే అటు యుద్ధ సన్నాహాలు సాగించారు అనే విషయం మరువరాదు.

రాయబారాలు సాగిస్తూ యుద్ధ సన్నాహాలు దేనికి?

రాయబారం ఫలించకపోతేకదా యుద్ధ ప్రయత్నం అని అనుకుంటారు సామాన్యులు. కాని, వ్యాస మునీంద్రుడు రాజనీతి ఎలా ఉంటుందో, ఎలా ఉండాలో బోధించడానికి భారతం అనుగ్రహించాడు. ఒకవేళ రాయబారం విఫలం అయితే అప్పుడు ఉరకలూ, పరుగులూ తియ్యకూడదు. పైగా బలాబలాలు చూసుకుని యుద్ధ నిర్ణయాలు సాగుతాయి. శత్రువు మరీ బలవంతుడయినా, వాని మిత్రరాజుల సహాయం అధికమైనా యుద్ధం జరగకపోవచ్చును. ఇదీ ప్రధాన కారణం.

ద్రుపద పురోహితుడు కురుసభా భవనంలో సదస్య సమక్షంలో, ధృతరాష్ట్రుని ఎదుట సుఖాసీనుడై, ఒక్కమారు ఆ సభలోని సేనాపతులందరినీ తిలకించి :

మహావీరులారా!

ధృతరాష్ట్రుడు, పాండురాజు అన్నదమ్ములు. వారి బిడ్డలు తమ తండ్రుల సంపదలు అనుభవించడం ధర్మం. కాదనగలరా మీరు? అయితే ఈనాటి వరకూ ఏం జరిగిందో మీరెరుగుదురు. వారి ప్రాణాలు తియ్యడానికి వీరు ఎన్ని కుట్రలు పన్ని, ఎన్ని అన్యాయాలకు ఒడిగట్టారో ఇక్కడి వారందరూ చూశారు, విన్నారు.

అన్ని ఘోరాలు వీరు సాగించినా తమ పుణ్యఫలంవల్ల వారు బ్రతికి, బాహుబలంతో రాజ్యం విశాలం చేసుకున్నారు. అది సహించలేక జూదం ఆడి, మోసంచేసి, వారి రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్టు ఊరుకున్నాడు ధృతరాష్ట్ర మహారాజు. ఇంతతో ఆగలేదు వీరి ఆగడాలు.

పరమ సాధ్వియైన ద్రుపదరాజనందనను సభా మధ్యానికి ఈడ్చుకు వచ్చి, వస్త్రాపహరణానికి ప్రయత్నించారు. మహారణ్యాలకు పంపించారు. నోటికి వచ్చిన కూతలు కూశారు. అన్నిటినీ వారు సహించారు. ఈనాడు అన్నీ విస్మరించి సంధికి అంగీకరిస్తున్నారు. మీరు శాంతంగా వారితో స్నేహం చేయడం ఉచితం.

వారి, వీరి ప్రవర్తనలు తెలిసిన మీరు మర్యాదగా దుర్యోధనునికి బుద్ధి చెప్పడం అవసరం. వీరితో వైరం పెంచుకొని మానవ మారణం సాగించాలని పాండవులు భావించడంలేదు. అంతమాత్రాన వారు దుర్బలులనుకోకూడదు. ధర్మపరులు పాండవులు, ధర్మాన్ని మించిన బలం ముల్లోకాలలో లేదు.

అటు ఏడక్షౌహిణులే వున్నాయి, మీకు పదకొండు అక్షౌహిణుల బలం వున్నదనుకుంటున్నారేమో!

భీముని బాహుబలం, సాత్యకి సాహసం సహస్ర అక్షౌహిణులను నిలబెడతాయి.

ఇక గాండీవి నారి సారించి నిలబడితే ఎదుట ఆగగలవాడెవడు. వాని శౌర్యం, భుజబలం, ధనుర్విద్యా నైపుణ్యం ఎరిగిన వాడు ఫాలాక్షుడొక్కడే.

ఇదంతా ఒక ఎత్తు. వాసుదేవుడొక యెత్తు. ఆయన సంగతి మీరూ ఎరుగుదురు.

**వివిధోపాయ పరాయణుండు**
**రిపుదోర్వీర్యాపహార క్రియా**
**ప్రవణోద్యోగుడు, మంత్రరక్షణ**
**కళా ప్రావీణ్యగణ్యుండు**
**ధైర్య వివేకాది గుణోత్తరుండు**
**అఖిల విద్యాజాల సంవేది**
**మాధవు డాదిక్కటె, పాండవేయుల**
**క సాధ్యం బెద్దియుం గల్గునే!**

అందుచేత మహాత్ములైన పాండురాజ నందనులను సగౌరవంగా ఆహ్వానించి, వారికి కొంత రాజ్యం ఆర్పించి ఉభయులూ శాంతితో సుఖంగా ఉండండి, అన్నాడు.

ఈ మాటలు వింటూనే భీష్మ పితామహుడు పలికిన పలుకులువింటే ఈ పురోహితుడు రాయబార కార్యానికి ఎందుకు పనికిరాడో బోధపడుతుంది.

**నీ వాక్యము విప్రస్వాభావికమై**
**ఇట్లు శ్రుతికి పరుషంబైనన్**
**భావింప కార్యమున యందేవిధమున**
**సభకు నింత ఇష్టంబగునే ! !**

అయ్యా! మీ మాటలు వినడానికి పరుషంగా వున్నా కార్యసాధనకు అంతకంటే మార్గంలేదు. మీ విప్ర స్వభావం మీ చేత కటువుగా పలికించింది, అని భీష్ములవారనిన మాట సావధానంగా ఆలోచించండి.

అధర్మాన్ని ఖండించడమే బ్రాహ్మణ స్వభావం, ధర్మగ్లానిని ఆ గుండె సహించలేదు. ఎంత మతిమంతుడూ, చతురవచన కోవిదుడూ అయినా అన్యాయాలు చేసేవారు కనిపించేసరికి ఆయన గుండె ఉడికి, మనసులో మంటలు పుట్టాయి. జరిగిన చరిత్ర చెప్పి నిప్పులు చెరిగాడు. ఇది రాయబారి లక్షణంకాదు.

మతిమంతుడూ, చతురవచన కోవిదుడూ అయిన వాని మాట ఇలా ఉండకూడదు. కనుకనే భీష్ముడు చెవికి కటువుగా ఉంది మీ ప్రసంగం అన్నాడు.

అందువల్లనే ధృతరాష్ట్రుడు ఆ రాయబారిని యధోచితంగా సత్కరించి :

ఆర్యా! తమరు వెళ్ళిరండి, నేను, నా బంధుమిత్రులతో మాట్లాడి, సౌమ్య స్వభావం కలవానిని పాండవుల దగ్గరకు పంపుతాను అన్నాడు.

ఇక్కడ 'సౌమ్యుని పంపుతాను' అనడంలో వుంది రాజనీతిజ్ఞత. పరుషంగా మాట్లాడేవాడు రాయబారానికి పనికిరాడు, వేద వేదాంగాలు చదవడంవేరు, రాజకార్యం వేరు. అని గుర్తుచేశాడు వ్యాసముని ఈ ఘట్టంలో.

## రాజనీతివేత్తలకు, రాయబారులకు గురుతుల్యుడు ?

రాయబారం ఎలా నడపాలి? అనేది ఇప్పుడు చూడబోతున్నాం. మహాభారతంలో మన కంటికి నలుసులా కనపడినా, మేరువంత నీతిశాస్త్రం తెలిసినవాడు సంజయుడు. విదురునితో సమానంగా నిలబడే వ్యక్తిత్వం కలవాడు సంజయుడు. ఎవరీ సంజయుడు? ఏవిటి వీని జన్మ వృత్తాంతం? అనే సందేహాలకు సమాధానం భారతంలో లేదు.

ధృతరాష్ట్రుని అంతరంగిక సచివుడుగా సాక్షాత్కరిస్తాడు. అంతే అయితే ఇటు విదురుడు – అటు కృష్ణుడు ఈ ఉభయుల ముందు సంజయుడు సామాన్యులకు అంతగా కనిపించడు, కాని మనసు పెట్టి చూస్తూ భారతం చదివితే ఈ ఉభయులకూ ఒకమెట్టుపైన నిలబడతాడు. ఆ వ్యక్తిత్వం నిశితంగా పరిశీలిద్దాం.

❊ ❊ ❊

ద్రుపద పురోహితుని సాగనంపి ధృతరాష్ట్రుడు ఆప్త సచివుడైన సంజయుని రప్పించి, మాట్లాడి, పాండవుల దగ్గరకు రాయబారిగా పంపుతాడు.

ఇక్కడ ధృతరాష్ట్రుని మాటలు సావధానంగా చూడాలి.

'సంజయా! పాండురాజనందనలు ఉపప్లావ్యం చేరుకున్నారని విన్నాను. అక్కడ వాసుదేవుడు కూడా ఉన్నాడు. అందరూ ఉండగా వారితో ఉచిత రీతిని మాట్లాడి వారి విషాదం తగ్గించే ప్రయత్నం చెయ్యి. ఏం మాట్లాడాలి అనేది నీకు నేను చెప్పనవసరంలేదు. నా హృదయం నీకు తెలుసు.

'మీరు వనవాస క్లేశాలు అనుభవించి ఈనాటికి సుఖంగా ఉన్నారని విని నేనెంతో సంతోషించానని ముందుగా చెప్పు' అని సభలో ఉన్నవారందరి వైపు తలత్రిప్పి

'ముందు వెనుకలు చూడకుండా, మంచిచెడ్డలు ఆలోచించకుండా దుర్యోధనుడు ప్రవర్తించడం వలన ఇంత విపత్తు వచ్చిపడింది. ఇందుకు పాండవులను అనవలసిన పనిలేదు. మనమూ, వారూ, పాలూ, నీరూ కలిసినట్లు అన్యోన్యంగా ఉండవలసింది. వారి తండ్రి రాజ్యం వారు పాలించుకుంటే, ఈ కష్టాలు వారికి వచ్చేవికావు.

'ఇన్ని జరిగాక, ఈనాడు వారు మనలను నమ్మరు. అహంకారంతో అన్యాయాలకు దిగిన మనమీద వారికి ఆదరభావం ఉండదు. అయినా మన కర్తవ్యం మనం నిర్వర్తించాలి. అక్కడ ధర్మరాజున్నాడు. న్యాయమార్గం తప్పనివాడు.

మనం దురభిమానులమై వారి రాజ్యం వారికివ్వకపోతే, కృష్ణ సారధ్యంతో గాండీవం ధరించి అర్జునుడు ముల్లోకాలనూ అల్ల కల్లోలం చేస్తాడు. గదా దండం ధరించి భీమసేనుడు కురువంశీయుల మీదకి దూకుతాడనే ఊహ వస్తేనే నా గుండె బెదురుతున్నది.

ఇంకా నకుల సహదేవులు, సాత్యకి, విరాట, ద్రుపదులు వీరి కుమారులు, పాండ్య కేకయాధిపతులు వీరందరూ రుద్రరూపులై దిగుతారు. అన్నిటిని మించి, ధర్మరాజు ఆగ్రహం' అని కొంతసేపు ఆపి,

'సంజయా! ధర్మరాజు దగ్గరకు వెళ్ళి, వాని సోదరులూ, బంధుమిత్రులూ, ఉండగా నెమ్మదిగా తియతియ్యని మాటలతో, వారి మనస్సు శాంతింపజేయుము. యుద్ధానికి వారు దిగకుండా, శాంతంగా ఉండే మాటలు మాట్లాడు. ఇంక నీకు చెప్పవలసింది లేదు. వెళ్ళిరా' అని పంపించాడు

పాండవులు ధర్మపరులు చాలా బాధలు పడ్డారు. అని జాలిపడ్డాడు. వారి పరాక్రమాన్ని ప్రశంసించాడు. వింటున్నవారికి ధృతరాష్ట్రుడు ఎంత మంచివాడో అనిపిస్తుంది. తియ్యతియ్యగా మాట్లాడి శాంతింపజెయ్యి అన్నాడేకాని, వారికి రాజ్యం ఇస్తానని కానీ, ఇవ్వననికానీ, ఆయన నోట మాట కూడా రాలేదు. అదీ ధృతరాష్ట్రుని రాజనీతి! ఆయన హృదయం తెలిసిన సంజయుని వలెనే, మనం కూడా ఆ గుండెలోని కపట చింతన గ్రహించలేకపోతే మనమూ కన్నులున్న ధృతరాష్ట్రులమే అవుతాం. "నోటితో అనకుండా మొండిచెయ్యి చూపే పాఠం నేర్పాడిక్కడ."

భారతంలోని నాలుగు రాయబారాలలో సంజయుని రాయబారమే, చక్కనిదీ, చిక్కనిదీ, అయినా కృష్ణరాయబారానికి వచ్చిన ప్రచారం ఈయనకు దక్కలేదు. అందుకు కారణం శ్రీకృష్ణుని వ్యక్తిత్వం ముందు ఈ ధృతరాష్ట్ర సచివుని విగ్రహం చిన్నదైంది. వీని వినయం కంటే ఆయన వివేకం విశిష్టమైనది. సావధానంగా అక్షరాక్షరం అనుశీలిస్తే రాజనీతివేత్తలకు సంజయుడే గురువు. వాసుదేవుడు వటవృక్షం, సంజయుడు ఆముదం మొక్క. మన ఆరోగ్యమునకు ఆముదం చాలా అవసరం. అలానే సంజయ రాయబారం మన మనస్సును బాగా వికసింపజేస్తుంది. ఉభయపక్షాలకూ ఆప్తుడు సంజయుడు. కృష్ణుడు తన పక్షానికే ఇష్టుడు. కఱ్ఱ విరగకుండా, పాము చావకుండా, వ్యవహారం నడిపేవాడు సంజయుడు. పెద్ద పాముని చిన్న కఱ్ఱతో చిత్రవధచేయించగలవాడు శ్రీకృష్ణుడు.

సమస్య పరిష్కారం కాకుండా ఉంచగల రాజనీతి సంజయునిది. సత్వర పరిష్కారం సమకూర్చడం వాసుదేవుని వ్యూహం. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని, ఉద్యోగపర్వం చదవగలిగితే, రాజకీయాలలో రాణించగలుగుతారు. ఈ పర్వం నిండా రాజనీతినే నిక్షిప్తం చేశాడు వ్యాసమునీంద్రుడు. దానిని చక్కగా అందుకుని అందించారు తిక్కనగారు తమ అనుభవాన్ని సంధానం చేసి.

# మృదువుగా, పదునుగా

ఇప్పుడు సంజయుని మాటలు పరిశీలిద్దాం. హస్తినాపురం విడిచి పాండవులు నివసించే ఉపప్లావ్యం చేరుతూనే, వాసుదేవుని మందిరంలోకి వెళ్ళాడు. అక్కడ కృష్ణార్జునులు కులాసాగా మాట్లాడుకుంటున్నారు. భక్తితో చేతులు జోడించి, వినయంగా తలవంచి, వారి స్వాగత వచనాలకు, చిరునవ్వుతో సమాధానం చెప్పి, సెలవు తీసుకొని, మరునాడు ధర్మరాజు బంధుమిత్రులతో కొలువుతీరిన సమయంలో వెళ్ళి పాదాభివందనం చేశాడు.

ధర్మరాజు సాదరంగా దగ్గరకు తీసుకొని కూర్చోబెట్టాడు.

అందరూ సంజయుని నోటవచ్చే మాటకోసం ఎదురుచూస్తున్నారు.

'ధర్మనందనా! నా అదృష్టం వల్ల నీ దర్శనం అయింది. మా మహారాజు, మీ పెదనాయన, మీ కుశలవార్త విని నన్ను పిలిచి చెప్పిన సందేశం వినండి.

'మీ సోదరులు, ద్రౌపది, పుత్రులు, అందరూ క్షేమంగా ఉన్నారన్న వార్త తెలుసుకుని రమ్మన్నాడు' అని సంజయుడు అంటుండగానే ధర్మరాజు.

'మీ రాజుగారు దయతో మమ్ము చూస్తూ ఉండటం వల్ల మేము సుఖంగా ఇలా ఉన్నాము. నిన్ను మా దగ్గరకు పంపటం చాలా సంతోషం కలిగించింది. ఇంతకూ మీ ప్రభువు తనబిడ్డలతో మనుమలతో క్షేమంగా ఉన్నాడా? ద్రోణాచార్య, కృపాచార్య. అశ్వత్థామలు కుశలమే కదా! ధర్మపరుడైన మా పితామహుని పెద్దరికం సక్రమంగా సాగుతున్నదా? మేము బ్రాహ్మణులకిచ్చిన అగ్రహారాలు యథాతథంగా వారి ఆధీనంలో ఉన్నాయా? ఏమైనా ఆక్రమణలు జరిగాయా? శత్రువులెవరైనా దండయాత్రకు వస్తే అక్కడి ప్రజలు మా భీమార్జున నకుల సహదేవుల సాహస పరాక్రమాలు స్మరిస్తున్నారా? నా సోదరులు సాగించిన శత్రుసంహార గాథలు చెప్పుకుంటున్నారా? ఘోషయాత్రలో గంధర్వులను జయించి, దుర్యోధనుని బాధవిముక్తుని చేసిన కథ మరువలేదు కదా?

దుర్యోధనుని దగ్గర కర్ణుని పెత్తనం చెక్కుచెదరకుండా సాగుతూనే వుందనుకుంటా?" అని ప్రశ్నలు గుప్పించగా సంజయుడు

"ధర్మనందనా! మా రాజుకొలువులో, నీతిమంతులు, అవినీతిపరులూ అహంకారులు, సత్వగుణ సంపన్నులు అందరూ వున్నారు. ఒకరి మాట ఒకరు వినే ఓరిమి లేనివారే. అందుచేత అక్కడి వారిని గురించి ఏమీ అనుకోవల్సిన పనిలేదు.

ప్రధానాంశానికి వస్తే చంద్రునివలె చల్లని మనస్సుకల మీరు వారితో స్నేహం కోరుతున్నారు. అంతకంటే, ఏం కావాలి? నీ శాంతి సంకల్పం వల్ల వారందరూ ఇతఃపూర్వం

ఎలా వున్నా, ఇప్పుడు సుఖంగా ఉంటారు. వార్ధక్యం కారణంగా మా మహారాజు మనస్సు స్థిమితంగాలేదు. అందువల్లనే తన కొడుకు సాగించే అత్యాచారాలు ఆపలేకపోయాడు. తరువాత బాగా ఆలోచించి మనస్సు వికలం చేసుకుని ఇప్పుడిప్పుడే కొంచెం సుఖంగా వుంటున్నాడు.

ఇవన్నీ తెలిసిన మీరు, అజాత శత్రువులని కీర్తి పొందిన మీరు గతాన్ని మరచిపోగలిగితే, సుఖం, శాంతీ లభిస్తాయి.

బ్రాహ్మణులు లోక కళ్యాణార్థం ప్రభవించి, అజ్ఞానాంధకారాన్ని నాశనం చేయగల సమర్థులు. అటువంటి వారికి మీరిచ్చిన అగ్రహారాలనూ, సిరి సంపదలనూ, హరించే దుర్మార్గులుండరు. శత్రువులు దాడికి వచ్చినప్పుడు హస్తినాపుర ప్రజలు భీమార్జున నకుల సహదేవులను తలచుకుంటూనే వున్నారు. మీ వంటి సజ్జనులు, శాంతి హృదయులు లేరు అనేమాట ఏ నోట విన్నా వినపడుతూనే వుంది. ఈ విషయాలన్నీ అలా వుంచు. ముఖ్యాంశానికి వద్దాం, అన్నాడు.

ముఖ్యాంశం ముచ్చటించే ముందు మనం ఈ ఉభయుల ప్రసంగాలనూ పరిశీలిస్తే,

ఇద్దరూ సత్యమే చెప్పారు. ఇద్దరూ సౌమ్యంగా, మృదువుగా మాట్లాడారు. ఏ పరుషమైన మాట రానివ్వలేదు. సామాన్యులెవరికీ వారి మాటటలో బాధ కలిగించేది లేదు. వివేకవంతులు పట్టగలరు – అంత మృదువుగా ఆడిన మాటల వెనుక ఎంత పదునైన కత్తులున్నాయో, ఒకరి కొకరు తీసిపోకుండా మెత్తమెత్తగా ఎలా వాయించారో. అది తెలియకపోతే రాజనీతి తెలియదు.

"మీ ప్రభువు దయవల్ల మేమిలా హాయిగా వున్నాం" అన్నాడు ధర్మరాజు. అంటే పన్నెండేళ్ళ అరణ్యవాసం, ఏడాదిపాటు విరటుని కొలువులో సేవకావృత్తి, మీ రాజు వలన కాదా, అని ఎత్తిపొడుపు–దానికి సంజయుడి సమాధానం–

"మీరు గతాన్ని విస్మరిస్తే మావారు క్షేమంగా వుంటారు. మీరు శాంతిచిత్తులైతే మాకు సుఖ సంతోషాలు" అన్నాడు.

అలా మాట – మాటకూ తూచి – తూచి పదిమార్లు చూసుకుంటూ, చదివితే వ్యవహార నిర్వహణకు అవసరమైన వివేకం చేకూరుతుంది.

అందుకే – చదివిన కొద్దీ చవులూరించే గ్రంథం భారతం అన్నారు అనుభవజ్ఞులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు.

ఆషామాషీగా కాలక్షేపం చెయ్యడానికి భారత రామాయణాలు అవసరం లేదు. అందుకు కాశీమజిలీ కథల నుండి కావలసినన్ని చిరుతిండి పుస్తకాలున్నాయి, ఒకసారి చదివి అంటించి పారెయ్యడానికి!

మనసుకు పట్టే మాలిన్యాలను ప్రక్షాళన చేసి బుద్ధిని సక్రమంగా వికసింపజేసుకుని

లోకంలో మన జన్మ సార్థకం కావాలనుకుంటే మహాభారతం, రామాయణం నిత్యం చదవటం ఆరంభించండి.

# ధర్మాధర్మాలు

ధర్మరాజు : సంజయా! ధర్మం – ధర్మం అంటూ ఏమేమో చెబుతున్నావు కానీ, ధర్మం, అధర్మం నువ్వూ, నేనూ నిర్ణయించలేం. ధర్మంవలె కన్పిస్తూ అధర్మం అయ్యేవి కొన్ని, అధర్మంగా పరిణమించేవి కొన్ని ఉన్నాయి. ఇది అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు కూడా నిర్ణయించలేని విషయం.

నేను చేసేది అధర్మం అని నిరూపించి అప్పుడు నన్ను నిందించు. క్రోధాన్ని సంహరించాలనీ, అహింసావ్రతాన్ని అనుసరించాలనీ కొత్తగా చెప్పవలసిన పనిలేదు.

పాపాత్ములు, లోకకంటకులు, వంశదూషకులు అయినవారిని సంహరించడం పరమధర్మం అని ప్రాజ్ఞులంటున్నారు. అదీకాక యుద్ధం క్షత్రియధర్మం కాదనగలవా!

ఈ మీమాంస దేనికి – మానవుడికి కర్తవ్యం బోధించడానికి అవతరించిన వాసుదేవుడు ఇక్కడే ఉన్నాడు. ఈయన జగత్తుకే ఆచార్యుడు. విశేషించి మాకు గురువు.

వీరు మాట్లాడుతుండగా వింటున్న వారెవరూ పెదవి కదపకుండా చూస్తున్నారు. సంజయుని ముఖాన ధృతరాష్ట్రుని బుద్ధి తెలిసింది. ధర్మరాజు నిర్ణయం బైటపడింది.

అప్పుడు వాసుదేవుడు! 'సంజయా! నేను పాండవుల శ్రేయస్సు కోరేవాడిని. మీ ప్రభువు పుత్ర పౌత్రులతో సుఖంగా ఉన్నాడు. వీరి మధ్య ద్వేషం రగిలి నాశనం కాకూడదని ఉదాసీనంగా ఇంతకాలం చూశాను.

మీ మహారాజు వీరికి శాంతి పాఠాలు వినిపించమని నిన్ను పంపాడు. చాలా సంతోషం. వినయంతో, స్నేహభావంతో, ధర్మబద్ధంగా నీనోట శాంతిపాఠాలు వింటుంటే ఎంతో సంతోషం కలిగింది. మీ ఉభయుల ప్రసంగాలూ విన్నాము. ధర్మరాజు నీ సంధివాక్యాలకు అంగీకరించినట్లు కనిపించలేదు.

మీ దుర్యోధనుడు అహంకారోన్మత్తుడు. మీ మహారాజు హృదయం కొంత ఇప్పుడే తెలిసింది. ఇక నువ్వు తియ తియ్యని మాటలతో వీరికి జోలపాడి నిద్రపుచ్చుదామను కుంటున్నావు, మీ రాజు కోరిక ప్రకారం.

లోకంలో ఎంతటి అవివేకులైనా వారి భాగం వారికి అందకపోతే వూరుకుంటారా.

మరొక్కమాట సంజయా!

ఇంతక్రితం జరిగిన అన్యాయాలూ, అత్యాచారాలూ తవ్వి తలమీద పొయ్యకుండా

శాంతిగా వారితో కలిసి అన్నదమ్ములవలె బ్రతకాలనుకోవడం కంటే అహింస, క్షమ, న్యాయం వేరే ఉన్నాయా? వీరి తండ్రి సంపదలు వీరు సాధించుకోవడానికి కత్తులెత్తడం ద్రోహం అంటావా? సంగ్రామం క్షత్రియధర్మం కాదంటావా"

యజ్ఞయాగాలు చేయడం, చేయించడం బ్రాహ్మణుల ధర్మం అని విధించిన శాస్త్రవేత్తలు, రాజులు దానం చెయ్యాలి కాని దాతముందు చెయ్యిజాపడం క్షాత్రంకాదు అనలేదా?

వర్ణ ధర్మపాలన చెయ్యవలసిన ప్రభువు ధర్మవిరుద్ధంగా నడవడం న్యాయమా? సాధు హృదయులై సన్మార్గాన నడిచేవారిపై దుర్మార్గాలకు దిగే క్రూరులను సంహరించడానికి శస్త్రాస్త్రాలు పుట్టాయి. ఇక ఇక్కడ చెప్పే ధర్మాలు మీ మహారాజుగారి బిడ్డలకు బోధించనవసరం లేదా? వారికి కన్నూమిన్నూ కనపడక అహంకారముతో అత్యాచారాలకు దూకడం అలవాటయింది.

సంజయా? ద్యూతక్రీడ వీరితో పుట్టలేదు. కానీ జూదంలో ఓడినవాని ఇల్లాలిని సభకీడ్పించి పరాభవించడం విన్నావా? ఇంతకంటే వారి దుర్మార్గానికి మరొకటి ఏం కావాలి? అన్నాడు.

సంజయ : స్వామీ! ఆ విషయాన్ని అంతగా ప్రస్తావిస్తే ముందుకు సాగగలమా!

శ్రీకృష్ణ : సంజయా! అంతసాగుతూంటే కురువృద్ధులు నోరెత్తకుండా ఎందుకు కూర్చున్నారు. మీ ప్రభువుల మనసు తెలియక కదా! నాడే ఆయన తన కొడుకులను మందలించి ఉంటే లోకం ఎంత సంతోషించేది! మహాయోధులు, ధర్మపరులు నిండిన సభలో నోటికొచ్చిన కూతలు కూసి ఊరుకున్నారా! ఇంటికోడలిని జట్టుపట్టి ఈడ్చుకొచ్చి దుశ్శాసనుడు అంతఘాతుకానికి ఒడిగట్టినప్పుడు. ఆ ఇల్లాలు గోలుగోలున విలపిస్తుంటే మీ మహారాజు కిమ్మనకుండా కూర్చుని, ఇప్పుడు నిన్ను పంపించాడా వీరి క్షేమం తెలుసుకు రమ్మని. నాడు మీ సభలోని పెద్దలందరు కీలు బొమ్మల వలె కూర్చుంటే, ఆమె తన పాతివ్రత్యంతో రక్షించుగోగలిగింది కనుక పాండవులు బ్రతికిపోయారు. నిజానికి రాజవంశీయులకు అంత అవమానం జరగవలసిందేనా? జరిగినా క్షత్రియవీరుడు సహిస్తాడా!

అంతతో ఆగిందా, అప్పుడు మీ దుర్యోధనుని ఆప్తమిత్రుడు కర్ణుడేమన్నాడో గుర్తున్నదా!

'పాంచాలీ, నీ భర్తలు జూదంలో ఓడిపోయి విడిచిపెట్టారు నిన్ను, ఇప్పుడు నిన్ను గాఢంగా ప్రేమించే భర్తను అన్వేషించు' అని పరుషంగా అంటుంటే అర్జునుని హృదయం ఎంత కుమిలిపోయింది! ఆ బాధకు ఇంతవరకూ ఉపశమనంలేదు.

సంజయా! దుశ్శాసనుడు వికటాట్టహాసం చేసి! 'నీ భర్తల పౌరుషం చచ్చింది, వీరిలో పౌరుషం ఉన్న వాడొక్కడూ లేడు' అని అరిచాడు. నిజమే, ఇన్నాళ్ళూ పురుషకారం వీరిలో చచ్చింది. అయితే అందువల్ల మీ వారికి ఒరిగినదేమున్నదయ్యా. అన్నీ ఇప్పుడు తిరగతోడి లాభంలేదు. ఇంత జరిగాక సంధికి సావకాశంలేదు. ఆయినా పాండవులను బ్రతిమాలి,

అంగీకరింపచేసి, నేను రాయబారిగా హస్తినాపురం వచ్చి సంధికి ప్రయత్నిస్తాను. నా మాటలు వారి చెవికి ఎక్కితే కాలపాశం నుండి కొంతకాలం తప్పించుకుంటారు. తల బిరుసు తగ్గక అవహేళన చేశారా, సంజయా, పాండవుల శస్త్రాలు కాదు వారి లోభమే వారిని దహిస్తుంది.

అసలు రహస్యం విను –

మీ దుర్యోధనుడు రోషమయమైన వృక్షం,

దాని మ్రాను కర్ణుడు, కొమ్మలు శకుని,

దుశ్శాసనాదులు ఫలపుష్పాలు, దానితల్లి వేరు మీ ప్రభువు

ఇక ఇటు చూస్తే

పాండవాగ్రజుడు ధర్మతరువు

అర్జునుడే దీని మ్రాను,

భీమసేనుడు శాఖ, నకుల సహదేవులు ఫలపుష్పాలు

వేదాలు, వేదవిదులు, నేను దీని మూలాధారం

ఇప్పుడాలోచించు, ఏది ఎంతటిదో!

ధృతరాష్ట్రుడూ, ఆయన బిడ్డలూ వనమైతే పాండవులు సింహాలు, సింహాలులేని వనానికి రక్షణ లేదు. వనంలో ఉంటేనే సింహాలకు రక్షణ. ఈ విషయం వారికి చెప్పు. వీరు మీ ప్రభువు సేవలో, శత్రు సంహారానికి సన్నద్ధులై ఉన్నారు. తన బిడ్డలవలె వీరిని కూడా చేరదీయడం మీ రాజు విధి. ఇంక ఈ ప్రసంగం ఆపుతాను. నేను హస్తినాపురం వస్తున్నానని మీ రాజుతో చెప్పు'.

## విఫలమైనా సఫలం

సంజయ : 'ధర్మనందనా! నా కర్తవ్యం నిర్వర్తించాను. ఇది సఫలం అయిందని భావిస్తున్నా'నని సభలోని వారందరినీ వినయంగా చూసి, చేతులు జోడించి 'మహానుభావులారా! నాకు సెలవిప్పించండి. నా మాటలలో అనుచితాలేవీ లేవనే నమ్ముతున్నాను' అని నిలబడ్డాడు.

ధర్మరాజు : సంజయా! ఇంత చక్కగా వ్యవహారం నడపగల వారు విదురుడూ, నువ్వు. మీ ఇద్దరికీ అంత వివేకం ఉన్నది. నీ నోట అనవసర ప్రసంగం రాదు. పొల్లు మాటలు రావు. నిజాన్ని నిర్భయంగా చెప్పే నేర్పు, వినయం నీకే లభించాయి. క్షేమంగా వెళ్ళిరా. వెడుతూనే హస్తినాపురంలోని బ్రాహ్మణోత్తములందరినీ దర్శించి, వారికి ప్రణామాలందించి, వారి యోగక్షేమాలు సదా మేం కోరుతున్నామని చెప్పు. ఆ తరువాయి

మా తాత భీష్ములను, గురువులు ద్రోణాచార్య, కృపాచార్యులనూ చూసి మా అభివాదాలందించు. మా పెద తండ్రి ధృతరాష్ట్రుని పాదాలకు నమస్కరించి, ఆయన పెద్ద కొడుకు దుర్యోధనుని క్షేమం అడుగుతున్నానని చెప్పు. అన్నివిధాలా వానికి తమ్ముడైన దుశ్శాసనునితో, మిగిలిన తమ్ములందరి కుశలం, అంతఃపుర స్త్రీల యోగక్షేమాలు అడుగు. వినయంతో విదురునికీ, శల్యునికీ అభివాదాలు చెపుతున్నా. ఆశ్వత్థామకు గాఢాలింగనం, బాహ్లిక, సోమదత్త, భూరిశ్రవసులతో ప్రీతిగా మాట్లాడు. కర్ణ, శకుని, సైంధవ, కృతవర్మలతో పాటు అక్కడున్న యుద్ధప్రియులైన రాజులందరితో ఎవరితో ఏం మాట్లాడాలో నీకు నేను చెప్పాలా?

మేము శత్రుసంహారం చేసి, మిత్రులతో కలిసి అక్కడి దాసీ జనాన్ని ఆదరంతో చూడగలమని వివరించు. వెడుతూనే నువ్వు ఈ విషయాలన్నీ ముచ్చటించి సభాభవనంలో మీ మహారాజు కూర్చుని ఉండగా, అందరూ సావధానులై వున్నప్పుడు నిర్మొహమాటంగా చెప్పవలసిన మాటలు విను.

మహారాజా, నీ పరాక్రమం కారణంగా మేము ఏ విపత్తులలోనూ బాధలు పడకుండా బంధుమిత్రులతో ఇప్పటికి సుఖంగా ఉన్నాం.

చిన్ననాడే మా కన్నతండ్రి మరణిస్తే మా రాజ్యం మాకిచ్చి రక్షించావు. ఈనాడు ఉపేక్షించి మమ్మల్ని ఇలా విడిచిపెట్టడం ఉచితం కాదు. అన్నదమ్ములం అన్యోన్యంగా ఉండడం శ్రేయస్కరం అవి మా పెద్ద నాన్నగారితో పలికి, మా తాతగారితో :

మీ వివేక పరాక్రమాలు కురువంశం అంతం కాకుండా నిలిపి ప్రవృద్ధం చేశాయి. ఇప్పుడు నీ మనుమలు అధర్మానికి దిగి అపఖ్యాతిపాలుకాకుండా, పరస్పర సంహారాలతో నాశనం కాకుండా చూడడం, మీ బాధ్యత. దీనిని నిర్వర్తిస్తే లోకంలోని క్షత్రియులు, బ్రాహ్మణులు, నిఖిల ప్రజలూ నిన్ను అభినందిస్తారు. మేము యుద్ధాన్నికాక శాంతియుత జీవితమే కోరుతున్నాం. సంజయా! మా దుర్యోధనుడు, బంధుమిత్ర పరివారంతో వినవలసిన మాటలు

సోదరా! విక్రమసాహస సంపన్నులమైన మమ్ము బలహీనులుగా భావించి అవివేకివై, నిండుసభలో పాంచాలిని పరాభవించి మమ్ము అడవులపాలు చేసినా శాంతంతో సహించాం.

ఈ నాటికీ మేము మీతో అన్నదమ్ములవలె శాంతి సుఖాలు పొందాలనే వాంఛిస్తున్నాం. అనవసరంగా యుద్ధం సాగించి సోదరులను బలిచెయ్యకు. నీ సమక్షంలో వున్న యోధులుమరెక్కడా లేనిమాట నిజమే. కాని, ఆ యోధులందరినీ మించిన ధర్మం మాకు తోడుగా ఉంది. ధర్మరక్షణ దీక్షితుడైన వాసుదేవుడు మావెంట ఉన్నాడు.

భీమార్జునులకు వలెనే మీకు కూడా నేను అన్నగారిని. నా మాట విని ఎవరి

సిరిసంపదలు వారు అనుభవించడానికి అంగీకరించు. అది మన పెద్దలకూ, వివేకధనులకూ ఆనందదాయకం.

మా తండ్రి రాజ్యం ఇవ్వడానికి మనసొప్పకపోతే నా తమ్ములు నలుగురికీ నాలుగు నగరాలిచ్చి నాకొక గ్రామం ఇచ్చినా చాలు, దానితో తృప్తిపడి అందరం సుఖంగా ఉందాం.

అప్పుడు దేశంలోని రాజులందరూ సంగ్రామ యజ్ఞంలో ఆహుతి కాకుండా సుఖంగా సంసారాలు చేసుకుంటారు.

సంజయా! ఇంతకన్న చెప్పవలసింది లేదు. వెళ్ళిరా, అన్నాడు.

అర్జునుడు బాల్య స్నేహం కారణంగా సంజయుని దగ్గరకు వెళ్ళి చేతిలోకి చెయ్యి తీసుకొని :

'మిత్రమా! చిన్ననాటినుండీ మేము నీతిమార్గం విడచి దుష్టబుద్ధితో ఉంటున్నామని నీకు తెలుసుకదా! మత్తేభంవలె విజృంభించే మా భీమసేనుని వెనుక అంకుశం అయిన ధర్మరాజు దయాహృదయం ఇంకా పొంగుతూనే ఉంది. ఇంక మీ రాజకుమారులకు భయం దేనికి' అని దెప్పిపొడుస్తుంటే ధర్మరాజు వారించి సంజయునికి చీనాంబరాలు, సువర్ణ భూషణాలు కానుకగా ఇప్పించి పంపించాడు.'

తిరిగి వచ్చిన సంజయుడు ధృతరాష్ట్రుని దర్శించి తలవంచి చేతులు జోడించి :

ప్రభూ ! మీ ఆదేశానుసారం ధర్మరాజును చూసి వచ్చాను. ఆ గుణశాలి మీ పాదాలకు నమస్కారాలు తెలుపుతున్నాడు. మీ బిడ్డల, బంధువుల, పరిజనుల క్షేమం కోరుతున్నాడు. సంతోషంతో నాకు సత్కారాలు జరిపాడు అన్నాడు.

వినిన ధృతరాష్ట్రుడు "సంజయా! వారందరూ మిత్ర బాంధవులతో కుశలంగా ఉన్నారా?" అనగా సంజయుడు.

'మహారాజా! మీపరాక్రమంవల్ల సుఖంగా ఉన్నామని చెప్పారు. ఆలోచించి చూస్తే అది యదార్ధమే కదా!

ఇక – ధర్మరాజుకి ధర్మంమీద ఉన్న ప్రీతి మరి దేనిమీదా లేదు. ఆయన నిర్మల హృదయంలో అహింసకే స్థానం ఉన్నది. ధర్మజునికి పురుష కార్యంమీద కంటే దైవంమీదనే విశ్వాసం. ఇక జరగవలసిందంతా మీ చేతులలో ఉంచుతూ పుణ్యపాపాలు మీరే నిర్ణయించాలన్నాడు.

మీరు దుర్యోధన కుమారుని మాట కాదనలేరు. ఆయనకు కర్ణ, శకుని ప్రముఖులు ప్రధాన సచివులు. పెళ్ళాం బిడ్డలు లేనివాడెవడో ప్రవర్తించవలసిన రీతిలో మీరు నడుస్తున్నారు. నడిచే కొడుకులను చూసి సహిస్తున్నారు. మహారాజా! లోకంలో ఎందరు సింహాసనాలెక్కలేదు. వారు కూడా బిడ్డలను కన్నారు. కన్నబిడ్డలు దుర్మార్గులవుతూంటే సక్రమ మార్గానికి త్రిప్పుకోకుండా చూస్తూ కూర్చున్నారా!

ఈనాడు మిమ్ము ప్రజలందరూ దూషిస్తుంటే మనస్సు మలమల మాడుతున్నది. చెవులలో చీము పుడుతున్నది.

శకుని, దుశ్శాసనులిద్దరూ కలిసి తమరిని, తమ పెద్దబిడ్డను చెవులు వట్టి ఆడిస్తున్నారు. తమరు ఆడుతున్నారు. ఇంతకాలం పాండవులను ఎన్నిహింసలు పెట్టినా వారు సహించారు. ఓరిమితో ఉన్నంతకాలం వారిశక్తి తమకు తెలియదు.

నేడో, రేపో వారి ఓరిమి హద్దులు దాటుతుంది. ఆకలిగొన్న బెబ్బులులవలె వారు దూకుతారు. అప్పుడు మన బలం, కులం, అన్నీ చక్కబెడతారు.

ధర్మరాజు క్షమాగుణంతో ఉంటే అసమర్ధతగా మీ వారు భావించి కొండను ఢీకొనే పొట్టేళ్ళవలె తయారయ్యారు.

సాధుజంతువు ఆగ్రహించిందో అంతం చూసి తీరుతుంది. జూదం పేరిట అన్యాయం సాగుతుంటే ఉపేక్షించారు తమరు. మనస్సు స్వాధీనంలో ఉన్న ధర్మరాజు ఎంతటివాడో మీరెరుగుదురు.

ప్రభూ! మెత్తని పులి ధర్మసూతి. లోకం అంతా మిమ్మల్ని అధర్మపరులని ఘోషించే వరకూ ఆయన కన్నెత్తడు. పన్ను కదపడు. లోకం పూర్తిగా మీ దోషాలనూ, ద్రోహాలనూ గ్రహించాక విజృంభిస్తాడు. నాడు ఆ అగ్నిని చల్లార్చడం మనతరం కాదు.

సరే, ప్రయాణంలో బాగా అలసి, అవయవాలన్నీ స్వాధీనం తప్పుతున్నాయి. నాకు సెలవిస్తే రాత్రి విశ్రమించి ఉదయం సభాభవనంలో తమ బిడ్డలు, బంధువులు, మిత్రులు పరివేష్టించి ఉండగా విషయాలన్నీ వివరిస్తాను, అని నమస్కరించి అనుజ్ఞ పొంది ఇంటికి చేరాడు.

ఒక్కసారి ఈ సన్నివేశాన్ని మళ్ళీ చదవండి.

పాండవులతో మాట్లాడుతున్నంతసేపు కౌరవుల ఘనతను వివరించాడు. ధృతరాష్ట్రునితో మాట్లాడినదంతా, ఆయననూ, ఆయన కుమారులనూ మందలించడం, వారి అన్యాయాలనూ, అకార్యాలను ఎత్తిచూపడం, రాయబారిగా రాజు క్షేమాన్ని కోరి ప్రసంగించాడు.

ధృతరాష్ట్రుని అంతరంగిక సచివుడుగా ఆయనకు చెయ్యవలసిన హితబోధ చెయ్యడానికి యీషణ్మాత్రం సంకోచించలేదు, అంటే రాజనీతిని ధర్మబద్ధంగా ఎలా అనుసరించాలో చూపినవాడు సంజయుడు.

ఇక్కడేకాదు. మహాభారతంలో సంజయుడు ఎక్కడ కనబడినా మనం సావధానులమై వాని మాటను, ప్రవర్తనను పరిశీలిస్తే లోకజ్ఞానంతో పరమార్ధం కూడా అందుకోగలుగుతాం. అదీ సంజయుని విశేషం.

# మాటలలో తనకు తానే సాటి

మరునాడు–

సభా భవనంలో కురువంశ ప్రముఖులతో ద్రోణాచార్య, కృపాచార్యాది గురువులు ఆసీనులైనారు. సంజయుడు ద్వారం దగ్గర నిలబడి–

"మహారాజుకి నా రాక ఎరింగించి రా", అని ద్వారపాలకున్ని పంపాడు. వాడు తిరిగి వచ్చి.

"మహారాజు మీ కోసం ఎదురు చూస్తున్నారు," అని చెప్పిన అనంతరం లోపలకు వెళ్ళాడు.

మహారాజును మందలించే చనువు సంజయుడికి వున్నా, రాజమర్యాదలు విస్మరించకుండా సంప్రదాయబద్ధంగా నడవడం కనిపిస్తుందిక్కడ. ఈ నియమాలను పాటించడం వల్లనే చివరివరకూ రాజుకి అంతరంగికుడుగా వున్నాడు.

రాజసేవలో ఎలా ఉండాలో విరాటపర్వ ప్రారంభంలో ధర్మ రాజాదులకు వారి పురోహితుడు ధౌమ్యులవారి హితబోధ ఓమారు చదవండి.

సభలో ప్రవేశించి తనకు నిర్దిష్టమైన ఆసనం మీద కూర్చుని సదస్యులందరినీ తిలకించి

: "ప్రభువుల ఆదేశానుసారం పాండవుల దగ్గరకు వెళ్ళి ధర్మరాజును దర్శించాను. ఆ ధర్మమూర్తి నన్ను చూస్తూనే కురువంశీయులందరి క్షేమం పేరు పేరునా అడిగాడు.

ఇక్కడి పెద్దలందరికీ ప్రణామాలర్పించాడు. బంధు మర్యాదలు, మిత్రభావం, వాత్సల్యం ఎవరెవరి పట్ల చూపాలో అన్నీ ప్రదర్శించాడు.

నేను కూడా మహారాజు మాట ప్రకారం బంధు మర్యాదలు తూ.చ. తప్పకుండా నిర్వర్తించి, ప్రధానాంశం ప్రస్తావించాను. అప్పుడు ధర్మరాజు చెప్పిన మాటలు నాకే ఆశ్చర్యం కలిగించాయి, అని ఆగాడు.

అదీ సంజయుని వివేకం.

మహారాజు చెప్పమనిన మాటలు చెప్పాడు. వినిన ధర్మరాజు ఏమన్నాడో చెప్పకుండా. "ఆ మాటలు ఆశ్చర్యం కలిగించాయి". అని సదస్యులకు ఉత్సుకత్వం కలిగించారు. వారికి వినాలని ఉంటే ఆ విషయాలు చెప్పాలి, లేకపోతే మౌనం. రాజసభలో పద్ధతి ఇది.

సంజయుడు అలా అనగానే ధృతరాష్ట్రుడు ఆతురతతో.

సంజయా! ధర్మరాజు చెప్పిన మాట వినిపించు, అని అడిగాడు

తాను పాండవులకు వినిపించినదీ, వారు చెప్పినదీ యథాతథం అప్పగించి :

'సభానదులు సావధానంగా వినండి. మహారాజు ఆదేశానుసారం నేను ఉపప్లావ్యం

చేరుతూనే కృష్ణార్జునులు ఇద్దరినీ ముందుగా దర్శించాను. వారు నీతిమార్గం విడువకుండా పలికిన పలుకులు వినండి", అని అంటుఁడగానే ధృతరాష్ట్రుడు :

"సంజయా! వాసుదేవుని మనసు తెలుసుకోవడం మనకు ప్రధానం, ఆయన మాటలు ముందు వివరంగా వినిపించు" అన్నాడు.

సంజయుడు చెప్పబోతుండగానే ధృతరాష్ట్రుడు అడగడం చూసినప్పుడు ఆయన మనస్సు ఎంత భయంతో, ఆందోళనతో వున్నదో తెలుస్తున్నది. అన్యాయపు బుద్ధికి ఆందోళన తప్పదు.

"మహారాజా! కృష్ణార్జునులుభయులూ వున్న శిబిరంలోకి నన్నురమ్మన్నారు. అక్కడ సత్యభామ, ద్రౌపది సుఖాసీనులై మాట్లాడుకుంటున్నారు. ఆ భవనంలోకి వారి కుమారులు కూడా ప్రవేశించరాదట. నేను లోపల అడుగు పెట్టాను. వారుభయులూ ఒకే విధమైన వస్త్రాలు ధరించి, మణి భూషణాలు అలంకరించుకున్నారు. కృష్ణుని పాదాలు అర్జునుని తొడలమీద వున్నాయి. వాసుదేవుడు మందహాసంతో అర్జునునికి సంజ్ఞ చేశాడు. అర్జునుడు ప్రక్కనున్న పరిచారికల వైపు చూశాడు. వారు నవ్వుతూ కనకరత్నమయ పాదపీఠం తెచ్చి నా ముందుంచారు.

నేను ఆ పీఠాన్ని చేతితో తాకి క్రింద కూర్చుని రెండు చేతులూశిరమున వుంచుకుని ప్రణామం చేశాను.

గంధగజాలవలె వున్న ఆ బాహుబల సంపన్నులను చూసిన నాకు ఆనందాశ్రువులు పుట్టి శరీరం పులకించింది. అంతలో గుండెలో భయం అంకురించింది.

ధర్మరాజు నోట వచ్చిన మాటను నెరవేర్చడానికి వారు సిద్ధంగా వుంటారు, అటువంటి ధర్మరాజు మీదికి దాడి వెడలడం అంటే యమునితో తలపడటమే అనిపించింది.

వారు సంతోషంతో తాము తినే ఆహారం, పానీయాలు నాకు ఇప్పించి, తాము ధరించే చీని చీనాంబరాలు, మణి భూషణాలు బహూకరించారు. నేను నా రాకకు కారణం వివరించాను. వింటూనే అర్జునుడు మాట్లాడబోతుంటే కృష్ణుడు వారించి, చిరునవ్వుతో!

"సంజయా! మీ మహారాజు నిండుసభలో కొలువుదీర్చి వుండగా, ఆయన బిడ్డలు నూరుగురూ, ద్రోణాచార్య, కృపాచార్య, భీష్మ పితామహులు వింటుండగా చెప్పవలసిన మాటలు, బాగా గుర్తుంచుకో.

అజాతశత్రువైన ధర్మరాజుకి ఆగ్రహం వచ్చిందంటే, ఏటిలో నిప్పు పుట్టినట్టే. నిప్పును ఆర్పడానికి నీళ్ళు చాలు కానీ నీటబుట్టిన నిప్పును ఆర్పడం ఎలా? అందుచేత మీ వారిని త్వరలో వారు చేయదలుచుకున్న దానధర్మాలు చేసుకోమని చెప్పు. బంధుమిత్రులకు, ఆశ్రితులకు సత్కారాలూ, సన్మానాలూ కానిచ్చుకోమను.

అనుభవించవల్సిన సుఖాలు సంపూర్ణంగా ఆలుబిడ్డలతో కలిసి అనుభవించమను.

ఇన్ని మాటలెందుకు, ఎవరెవరికి ఏమేమి చేసుకోవాలని ఉంటే అవన్నీ తొందరగా జరిపించుకుని అరచేతులలో ప్రాణాలు పెట్టుకు కూర్చోమను.

ఈ మాట ఎందుకంటున్నానో తెలుసా!

ప్రపంచంలో ఏ నాడూ ఏ ఇల్లాలూ అనుభవించని అవమానంతో పాంచాల రాజపుత్రి నన్ను ప్రార్థించింది. ఆమె కోరిక నేటికీ తీర్చలేకపోయాను. ఆ అప్పు తీర్చడానికి సమయము ఆసన్నమైంది. అది పూర్తిచెయ్యడానికి సంకల్పించాను, నా సారథ్యంలో గాండీవం ఎక్కుపెట్టి అర్జునుడు రణరంగంలో విహరించడానికి వస్తున్నాడని, నాడు చెప్పినా మీ దుర్యోధనుడు, భీష్మద్రోణుల అండ చూసుకుని, కర్ణుని గర్వోక్తులు విశ్వసించి విజయం తనదే అనుకుంటున్నాడు," అని సంజయుడు చెపుతుండగానే ధృతరాష్ట్రుడు అడ్డుపడి–

"సంజయా! ఇంతకూ అర్జునుడేమన్నాడో చెప్పలేదు" అని ఎదురుప్రశ్న వేశాడు. క్షణక్షణానికీ పెరుగుతున్న ధృతరాష్ట్రుని ఆందోళన చూడండి!

"మహారాజా! అర్జునుని కన్నులు ఎఱ్ఱతామర రేకులలా ఉన్నాయి, అంతకంతకు అవి ఎరుపెక్కుతున్నాయి. అయినా నిశ్చలంగా నన్నుచూసి–

"సంజయా! మీ దుర్యోధనుడు తన స్నేహితులతో, సాయపడ వచ్చిన యోధులతో ఉండగా చెప్పవలసిన మాటలు విను!

మా అన్నగారు కోరుతున్నట్టు రాజ్యం ఇవ్వడానికి అంగీకరించకపోతే అదే మాకు మేలు. ఇంతవరకూ వాడు చేసిన దుర్మార్గాలకు అది పై పూత అవుతుంది. అప్పుడు నేను, మా భీముడూ సంతోషంతో రంగంలో ప్రవేశించి ధర్మరాజు కోరిక నెరవేరుస్తాం.

ఘోరారణ్యాలలో బండరాళ్ళ మధ్య ముళ్ళకంచెల మీద మా అన్నగారు శయనించిన దానికి ఫలంగా దుర్యోధనుడు రణరంగంలో బాణాల పానుపు మీద నడక తప్పదు. ఆడినమాటకు తలవంచి పడరాని కష్టాలు పడుతూ లోలోపల ఆగ్రహదానల జ్వాలలు నిలిపాడు. శాత్రవ నిబిడారణ్యం మీదికి ఆ అగ్నిని వదలక తప్పదు. అప్పుడు కాని దుర్యోధనునికి మా అన్నగారి శక్తి అర్థంకాదు. గదాదండం గిరగిర త్రిప్పుతూ ఏనుగులనూ, గుఱ్ఱాలనూ నేలకూలుస్తూ, ప్రళయకాల యమునివలె మా భీముడు విజృంభిస్తున్నప్పుడు భయపడి మీ దుర్యోధనుడు మా రాజ్యభాగం మాకిస్తాడు. నకుల సహదేవులు, అభిమన్యుడు, సాత్యకి వీరందరూ ఆకలిగొన్న పెద్దపులులవలె మీ సైనిక మృగాల మధ్య విహరిస్తుంటే ఫాలాక్షుడు ప్రళయవేళ తాండవిస్తున్నట్లే భావించి కురుకుమారులు సంధికి దిగుతారు. ద్రౌపదీనందనులయిదుగురూ సింహపుపిల్లలవలె మీ యోధులను మత్తేభాలవలె భావించి చీలుస్తున్నప్పుడు మీ దుర్యోధనుని అహంకారం చల్లారుతుంది. విరాట ద్రుపదులు తమ స్నేహితులతో, బంధువులతో నిర్భయంగా ఉద్రేకంతో విహరించిన నాడుకాని మాశక్తి మీ

వారికి తెలియదు. మా బావ శిఖండి భీష్ముని మీదకి సాగుతున్ననాడు దుర్యోధనునికి కాలం నిండుతుంది.

దృష్టద్యుమ్నుడు తన ధనస్సును విద్యుద్దండంలా నిలబెట్టి ద్రోణాచార్యుని వైపు పరాక్రమంలో రథం నడుపుతున్న క్షణంలో, నా గాండీవం నుండి వెడలు బాణాలు శత్రువుల శిరసులు ఖండించి, అవయవాలు సడలించి, మాంసం, నెత్తురు ప్రవహింపజేస్తుంటే, నా రథం మీద కపిధ్వజం కాంతులు కనులమిరుమిట్లు గొలుపుతుంటే, వాసుదేవుని సారథ్యంలో నన్ను చూసినప్పుడు కౌరవులకు తమ అన్యాయాలు గుర్తుకొస్తాయి. శకటాసుర, ధేనుకాసురాదులను బాల్యంలోనే యమసదనం చేర్చిన దేవకీనందనుని లక్ష్యపెట్టని దుర్యోధనునికి పరాక్రమం తెలుస్తుందా!

భీష్మ, ద్రోణ, కృపాచార్యులు పెద్దలకు నమస్కరించి మేము రణరంగంలో కాలు పెడుతున్నాం. పన్నెండేళ్ళు అరణ్యాలలో పడరాని పాట్లుపడి, ఏడాది అజ్ఞాతవాస క్లేశాలు అనుభవించాం. ఇప్పుడు మా కెదురువచ్చే యోధుల అస్త్రశస్త్రాలు మా ధర్మ ధనుర్బాణాల ముందు ముక్కచెక్కలు కాకతప్పదు.

అలా జరగకపోతే అధర్మం ధర్మాన్ని జయించిందని నమ్ము. మేము వాసుదేవుని ముందుంచుకుని వస్తున్నాం, విజయం మమ్ము వరించి తీరుతుంది.

సంగ్రామం తప్పదనే అనిపిస్తున్నది. పాశుపతాది దివ్యాస్త్రాలతో కురుకుల నాశనం జరిగే పరిస్థితి తెచ్చుకున్నారువారు. అక్కడి పెద్దలు మా వంశవృద్ధులు భీష్ములవారు, ఇంకా పెద్దవాడు బాహ్లికుడు, గురువులు ద్రోణాచార్యులు, కృపాచార్యులు, గురుపుత్రుడు అశ్వత్థామ, ధీయుతుడు నీతికోవిదుడు విదురుడు, ధర్మాచరణ నిపుణుడు శల్యుడు వీరందరూ చెప్పిన మాటలు చెవినిపెడితే దుర్యోధనుడు సోదరులతో సుఖంగా ఉంటాడు. మేము కోరేదీ యిదే!" అన్నాడు.

## సంకోచమెరుగని వివేకం

(పాండవుల వద్ద నుంచి సంజయుడు తిరిగి వచ్చాడు. పాండవులు తనతో ఏమన్నదీ ధృతరాష్ట్రుడికి వివరిస్తాడు. వారెంతటి శూరులో, ధీరులో తెలియచెప్పేందుకు ప్రయత్నిస్తాడు. అయినా ధృతరాష్ట్రుని ఆశ చావదు.... ఆ తర్వాత–

సంజయా! ఇక్కడ మన బలం, మనకు సాయపడవచ్చిన యోధుల విశేషాలూ వినికూడా ధర్మరాజు ఏ ధైర్యంతో సంగ్రామానికి సన్నాహాలు చేస్తున్నాడు అని ప్రశ్నించాడు.

ఆ మాటలు విన్న సంజయునికి మూర్ఛవచ్చినంత పని అయింది. వేడి నిట్టూర్పు

విడిచాడు. కొంతసేపు మాటరాలేదు. ఈ మహారాజు ఎంత మూర్ఖంగా ఉన్నాడు. ఈయన మనసు మార్చడం ఎవరితరం? అని విచారించి ఏమయినా ప్రభువు ప్రశ్నకు సమాధానం ఇవ్వడం తన విధి అని భావించి!

మహారాజా! ధర్మరాజు సంధి కోసమే ఎదురుచూస్తున్నాడు తమ తండ్రి రాజ్యం తమ కివ్వనినాడు ఎటువంటి సంకోచం లేకుండా సంగ్రామం సాగించడానికే సంకల్పిస్తున్నాడు.

ఇక వారు ఏ ధైర్యంతో వస్తున్నారని కదా అడిగారు.

**బక విధ్వంసి, జరాసురాంతకు**
**హిడింబ ప్రాణ హారీణు, కీచక నిర్మూలన**
**కేళీలోలు**
**సమరోత్సాహైక శీల ప్రవర్తకు**
**నాగాయుత సామ్యకీర్తిత బలోదగ్రుం**
**ప్రతి వ్యూహదాహకు, భీముం గొనివచ్చు**
**ధర్మజుడు బాహాటోపముం జూపగన్!**

బకాసుర, జరాసుర, కీచకులను యమసదనం చేర్చినవాడు, హిడింబాసురుని నేలమట్టం చేసి, వాని సోదరిని భార్యగా చేపట్టినవాడు, సమరోత్సాహశీలుడు వేల ఏనుగుల బలం కల భీముడున్నాడు.

కథాంశాన్ని వదిలి సంజయుని ధీశక్తిని పరిశీలిస్తే పాండవ బలాన్ని గురించి చెపుతూ ముందు భీముని విగ్రహం ప్రదర్శించాడు.

దీనికి కారణం.

ధృతరాష్ట్రునికి, అస్త్రబలం కంటె దేహబలం మీద విశ్వాసం ఎక్కువ. ఆయన దేహం చాలా దృఢమైనది. ఆయనకూ ఏనుగుల బలం ఉన్నది కనుక ముందుగా దేహబలంతో విశిష్టుడైన భీముని శక్తిని చెప్పాడు.

ఇక్కడ భీముడు చంపిన ముగ్గురూ వీని భుజబలానికి ఆగలేక నేలకూలినవారే అనే విషయం ధృతరాష్ట్రుడెరుగును. అందుకే ఆ ప్రస్తావనతో ఆరంభించి–

**ఆట మిన్నందిన యట్టి వాని పొడవెంతన్నట్లు**
**ఫాలాక్షు నెక్కటి కయ్యంబున కన్న**
**ఫల్గును భుజా గర్వంబు లెక్కించుటంతటి వానిం**
**గొని ధర్మసూతి సమరోత్సాహంబు మైనెత్తి**
**వచ్చుట కుం గొంకునె వీపు సక్కనయి**
**నిల్చుంగాక మీ సైన్యముల్**

ఆకాశమంత ఎత్తున్నవాడు అంటే వాడి పొడుగెంత? అనే అవివేకి ఉంటాడా! అలానే ఫాలాక్షుడంత వానితో ఎదురునిలిచి ఒంటరిగా పోరుసాగించిన అర్జునుడున్నాడు. మన సైన్యాలు వెనుతిరగకుండా నిలబడతాయో లేదో!

అనంతరం ఆ పక్షంలోని వీరులందరి విషయం చెప్పి–

మహారాజా! చతుర్దశ భువనాలనూ అరచేతిలో పెట్టుకోగల దేవకీనందనుడున్నాడు అని ముగించాడు, ముందు దేహబలంతో ఆరంభించి దైవబలం కూడా వారికున్నదని చెప్పినప్పుడు పురుషకారం–దైవం వారికే అనుకూలంగా ఉన్నాయని, రాజు శ్రేయస్సు కోరే సచివుని వలె బోధించాడు సంజయుడు.

చివరి మాటగా–

ప్రభూ! ఇంతవరకూ ఉపేక్షించారు. అన్ని అవమానాల పాలు చేసినా వారు బంధుప్రీతి వీడకుండా గంధర్వుల నుండి దుర్యోధనుని బంధముక్తుని చేశారు. అంటే వారికి మనమీద ఆగ్రహం లేదన్నమాటే కదా!

ఇప్పటికైనా వారు నీ మాట శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నారు. వారిని రప్పించి వారి కోరిక తీర్చు అన్నాడు. ఇంతటితో ఆగలేదు దుర్యోధనుని ప్రశ్నకు సమాధానమిస్తూ

రాకుమారా! పాండవులకు కైవారాలు పలుకుతున్నానని, వందిమాగధ స్తోత్రాలు చేస్తున్నాననీ అంటున్నావా! దానికి కారణం విను.

తెల్లని గుర్రాల రథంమీద కపిధ్వజంతో వచ్చే అర్జునుని రథానికి సారథి వాసుదేవుడని ఎరుగుదువా?

వారికున్న ఆయుధాలు, చతురంగ బలాలు మనకు తెలియనివికావు.

అంతదేనికి సంగ్రామంలో వారి నిర్ణయాలు సావధానంగా విను.

శిఖండి చేతిలో భీష్ముడు,

దృష్టద్యుమ్నుని శరవర్షానికి ద్రోణుడు

భీముని హస్తాలలో మీరు నూరుగురు.

మీ పిల్లల విషయం అభిమన్యుడు చూసుకుంటాడు.

శకుని, సైంధవ, కర్ణ, అశ్వత్థామలు అర్జునుని వంతు.

సాత్యకి కృతవర్మనూ, చేకితానుడు సోమదత్తునీ

పరాజితులను చేస్తారు.

నకుల సహదేవులు కళింగ, సారస్వత దేశాధీశుల విషయం తేలుస్తారు.

ధర్మనందనుడు శల్యునితో తలపడతాడు. ఇక మీ నిశ్చయం మీరు చేసుకోండి అన్నాడు.

అప్పటికీ ధృతరాష్ట్రునికి సందేహంగానే ఉంది.

సంజయా! ఇంతకూ పాండవులను ఇంతగా యుద్ధానికి పురికొల్పుతున్న వారెవరక్కడ? అనగా సంజయుడు.

మహారాజా! కౌరవ సేనాసముద్రానికి నేనొక్కడనే చెలియలికట్టగా నిలబడతాను. అని దృష్టద్యుమ్నుడు రొమ్ము విరిచి కోరమీసం ఎగదువ్వుతూంటే ధర్మరాజు చిరునవ్వుతో అతని వెన్నుతట్టుతున్నాడు.

ప్రభూ! ధర్మరాజు దయాహృదయుడు, మీరు వారి శరణువేడి శాంతంగా జీవించడం ఉచితం, మీకూ మీ బంధుమిత్ర పరివారానికి ఈ రాజ్యంలో సగం చాలు. మిగిలిన సగం పాండవులకు ఇచ్చి సంధిచేసుకోండి. అందువల్ల వంశనాశన ప్రమాదం నుంచి బైటపడతారు.

**కర్ణుండు రేచిపెట్టగ**
**దుర్ణయపరులైన శకుని**
**దుశ్శాసను లీనిర్ణయమె**
**మేలనగ నీ కర్ణములకు**
**నించునెట్లు కార్యవచనముల్.**

కర్ణుడు రెచ్చగొడుతున్నాడు. దుర్బుద్ధులై దుశ్శాసనుడూ, శకునీ ఆ మంట ఎగసన తోస్తున్నారు. వారి మాటలే నీకు ప్రియంగా ఉన్నాయి. మా మాటలు నీ చెవికెక్కవు అని చేతులు జోడించి మౌనం వహించాడు.

రాయబారిగా సంజయుడెంతవాడో గ్రహించడానికి ఈ సన్నివేశాన్ని మరోమారు చదవాలి.

పాండవుల దగ్గర తమ ప్రభువు పక్షాన్ని చులకన చేస్తూ మాట్లాడలేదు. కురుసభలో పాండవుల శక్తిని తక్కువ చెయ్యలేదు.

రాజనీతి తెలిసినవాడు ఎలా మాట్లాడాలో తమ వారినీ, ఎదుటివారినీ అంచనావేసి యధార్థస్థితిని ఎలా ప్రస్ఫుటం చెయ్యాలో నేర్పుతాడు.

తను సేవకుడుగా ఉన్నచోట మహారాజును మందలించడానికి కాని, రాజుగారి కుమారుల దుర్జనలక్షణాన్ని దుయ్యబట్టడానికి సంకోచించని వివేకి సంజయుడు. అంతగా దుయ్యబడుతున్నా ఆగ్రహించకుండా వినగలిగిన ప్రభువు ధృతరాష్ట్రుడు.

వింటేకాని దానిని ఆదరించడానికి అంగీకరించని మూర్ఖుడాయన– అందుకే భారత సంహితారచయిత మహర్షి వ్యాసులవారు

**మనకాప్తుడు సంజయుడు**
**ఈతని యుపదేశంబుపట్టి**
**ధర్మమున ముకుందుని ఆశ్రయింపవయ్య**
**అతని జొచ్చిన బ్రదుకుదీవు తమ్ములు సుతులున్**

నాయనా! సంజయుని మించిన ఆప్తుడులేడు మనకు. వాని మాటవిని వాసుదేవుని ఆశ్రయిస్తే నీ పిల్లలూ, నువ్వూ, నీ తమ్ముని కుమారులూ సుఖంగా వుంటారు అన్నాడు.

అంతటివాడు సంజయుడు.

ఇంత నీతిచతురుడైనా వాసుదేవుడనే మహావటవృక్షం ముందు మనకు కనిపించకుండా ఉంటున్నాడు. అయినా ఓపికతో భారతం తీసి సంజయుని మాటలు మననం చేసుకోగలిగితే దుర్మార్గులకు చెయ్యవలసిన హితబోధ గ్రహించగలుగుతాం.

వారు వినరు, వినకపోయినా వినిపించడం వివేకవంతుల విధి. ఆ విధి నిర్వహణకే భారతం నిత్యం అధ్యయనం చెయ్యాలి.

## మాటల మాటున రాజనీతి

ఉపప్లావ్యంలో సంజయుడు సెలవు తీసుకుని వెళ్ళిన మరునాడు ధర్మరాజు తన సోదరులనూ, బంధుమిత్ర యోధవరులనూ శిబిరానికి రప్పించి :

"ఇప్పుడు మనం దేవకీనందనుని అర్థించి హస్తినాపురానికి రాయబారిగా పంపి సంధి సాగించాలి. గురువులతో, వంశ వృద్ధులతో బంధుమిత్రులతో యుద్ధం జరపడం నా అభిమతం కాదు." అని అందరినీ వెంటబెట్టుకుని వాసుదేవుని మందిరం చేరి, కుశల ప్రశ్నలు ముగించి :

"మాధవా! మాకు ఆపదలు రాకుండా రక్షించి, శ్రేయస్సులు సమకూర్చడానికి నిన్ను చూపించారు మా నాన్నగారు.

**ఆపద గడవంబెట్టగ**
**నోపి శుభంబైన దాని**
**నొడగూర్పను మాకీ పుట్టువునకు**
**పాండుక్ష్మాపాలుడు నిన్ను చూపిచనియె మహాత్మా !**

"కృష్ణా ! స్నేహితుల కార్యాలు చక్కబెట్టి వారికి సుఖం సమకూర్చవలసిన సమయం వచ్చింది. దుర్మార్గుడైన దుర్యోధనునితో యుద్ధం చెయ్యకుండా మా రాజ్యభోగాలు అనుభవించాలని కోరుతున్నాం" అన్నాడు.

అందుకు కృష్ణుడు నవ్వుతూ ధర్మనందనా! నీ మనసులోని అభిప్రాయం విశదం చేస్తే ఆ ప్రకారం కార్యసాధనకు ప్రయత్నిస్తాను" అన్నాడు.

ధర్మరాజు : వాసుదేవా! మా పెద్దనాన్నగారి అభిప్రాయం, ఆయన పెద్దకొడుకు ఊహలూ తెలిశాయి. రాజ్యభాగం విషయం ప్రస్తావించకుండా యేవేవో కల్లబొల్లి మాటలు

చెప్పి వెళ్ళాడు. సంజయుడు. ఈమాటలతోనే మేము తృప్తి పడాలని వారి ఆలోచన. పదమూడు సంవత్సరాలు మేము నానాక్లేశాలూ పడి ధర్మబద్ధులమై అరణ్య, అజ్ఞాతవాసాలు ముగించివచ్చినా మా రాజ్యం మా కిచ్చే దృష్టి వారికి లేదు. ఆయన పుత్రప్రేమ అలా ఉంది. తన కొడుకులను దారికి తెచ్చుకోలేకపోతున్నాడు. మమ్ము కన్నతల్లికీ, బంధువులకూ సుఖం కలిగించకుండా దుఃఖాలతో ఉంచడం పౌరుషవంతుల లక్షణం కాదు. అయిదు గ్రామాలిచ్చినా మాకు చాలు అని మీ అందరూ వింటుండగానే చెప్పాను. ఇందుకు కూడా దుర్యోధనుడు అంగీకరించడా! బంధుమిత్రులకు గ్రాసవాసోదైన్యం లేకుండా ఉంచడానికేనా ప్రయత్నం.

గర్భ శత్రువునైనా సంహరించాలనే ఊహ నాకు రాదు. ఆ దశలో బంధుమిత్రులతో యుద్ధం సాగించి వారిని యమసందనం చేర్చడం ఎంత దోషం. ఆ అపవాదు భరించలేను. క్షత్రియ ధర్మంలో ఇంత కష్టం వున్నా పరధర్మం ఆశ్రయించరాదుకదా. స్వధర్మానుసారం అస్త్రశస్త్రాలు సంధించక తప్పదు. వంశ నాశనానికి నా మనసు విముఖంగా ఉంది. యుద్ధం వల్ల సిరిసంపదలు లభించినా మారణహోమం తప్పదు. ఒక్కో యోధుని యెదుట పదిమంది కూడా నిలవలేకపోవడం, బలాద్యుని దుర్బలుడు నేల కూల్చడం సంగ్రామంలో సాగుతూనే వుంటాయి.

జయాపజయాలు నిశ్చయం కావు. పరాజయం సంభవించడం కంటే హృదయాన్ని బాధించేది లేదు. యుద్ధం లేకుండా శత్రువును కడతేర్చే మార్గం తెలిసినవాడు గుండెమీద చేతులుంచుకు నిద్రపోగలుగుతాడు.

శత్రుత్వం వున్నదో వాడు త్రాచుపామున్న ఇంట్లో కాపురం చేసే వానిలా నిరంతరం భయంతోనే బ్రతకాలి. అందుకే వైరం దీర్ఘకాలం పనికిరాదంటారు, శత్రుత్వం లేకుండా చేసుకోవడం అన్నివిధాల శుభం. అయితే పగను పగతో జయించలేము. శత్రువు విరోధ భావం వీడకపోతే ఎదుర్కోక తప్పదు. అయితే వంశనాశన కారణమైన యుద్ధం సాగితే క్రూరుడనే అపకీర్తి తప్పదు.

ఆలోచిస్తుంటే శత్రుత్వం ఏనాడూ శ్రేయస్కరం కాదు. ఇప్పుడు ఎలా చూసినా శాంతిని మించిన మార్గం లేదు. అయినా సిరిసంపదలు వదులుకోలేం. అందుకు సంగ్రామం సాగించామో సర్వనాశనం తప్పదు కనుక ఉపాయాంతరం ఆలోచించాలి.

దానికి తగినట్లుగా మా ఉభయపక్షాలకూ హితవు కలిగే రీతిలో విదురాది సజ్జనులు హర్షించే రీతిలో అక్కడ మాట్లాడవలసింది నిశ్చయించుకో : మా మీద పక్షపాత బుద్ధితో ఉండకు.

నీ మాటలు పెడచెవినబెట్టి దుర్యోధనుడు పరుషంగా మాట్లాడినా ఓరిమితో విను. వాడు గురువుల మాటలు, పెద్దల హితవులూ వినడు. కురువృద్ధుడు మా పెద్దనాన్నగారి

అభిప్రాయం గ్రహించు. ఆయన పుత్ర వాత్సల్యంతో న్యాయమార్గానికి రాకపోయినా తొందరపడకు. లోకానికి మన ధర్మదృష్టి వెల్లడికావాలి ఈ సంకటం నుండి మమ్మీ రక్షించడానికి నిన్ను మించిన వైద్యుడు లేడు. కుటిల బుద్ధులు, అన్యాయవర్తనులు, క్రూరకర్ములు, నీచులు అయిన దుర్యోధనాదులకు నీతివచనాలు చెవికెక్కవు. పైగా, వారు నిన్ను ఏంచేస్తారో అనే భయం కూడా ఉంది. అందుచేత నిన్ను పంపడానికి నా మనసు అంగీకరించడంలేదు" అన్నాడు.

ఈ ప్రసంగంలో ధర్మరాజు యొక్క ధీకుశలత గోచరిస్తుంది. పైపైన వింటూంటే ఆయనకు యుద్ధం యిష్టంలేదనీ, శాంతినే కోరుతున్నాడనీ, శత్రుత్వం పుట్టరానిదని అంటున్నాడనీ అనిపిస్తుంది. కానీ ఆయన మనస్సులోని అభిప్రాయం వ్యక్తం చెయ్యకుండానే వివేకం కలవారికి ఆ గుండెలో ఏమున్నదో తెలిపాడు.

సంజయుడెంత వివేకం కలవాడో చూశాం. సంజయుని మించిన రాజనీతి ఈయన దగ్గర వున్నట్లు ఈ ప్రసంగంలో స్పష్టమవుతుంది.

ధర్మరాజు యుద్ధానికి సుముఖంగా ఉన్నాడా, అంటే ఈ ప్రస్తావనలో అది కనిపించకపోగా కులక్షయ కారణమైన కలహం శ్రేయస్కరం కాదనే ఆయన నోట పలికాడు. పలుకుతూనే సిరిసంపదలు వదులుకోగలమా అంటున్నాడు. అదీ వివేక లక్షణం.

దుర్యోధనుడేకాదు ధృతరాష్ట్రుడూ అంతటి కుటిలుడే అంటూ కృష్ణుడు.

"బావా! నీ ఊహ సక్రమంగానే ఉంది. వారు అకార్యాలకు దిగుతారు. దిగినంతలో నాకు వచ్చే ప్రమాదంలేదు. నేను కన్నులెర్రజేస్తే నా యెదట నిలిచేవాడు లేరు. నేను వెడతాను. మనకు శ్రేయస్సు కలుగుతుంది. ఒకరు ఆక్షేపణ చెయ్యడానికి వీలులేకుండా మారణహోమ పాపం మనకు చుట్టుకోకుండా మాట్లాడివస్తాను" అనగా ధర్మరాజు : బావా! అదే నీ అభిమతం అయితే వెళ్ళిరా, వారూ మేము భోగభాగ్యాలతో వుండేటట్లు చూడు. మా సంగతీ, వారి సంగతీ నీకు క్షుణ్ణంగా తెలుసు. ఇంక అక్కడ మాట్లాడాలనేది నీకు చెప్పడానికి నేనెంతవాడిని? అని వాసుదేవుడితో అంటాడు.

## ఏ తీరున బోధించాలి?

(ఉపప్లావ్యంలో కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్ళమని ధర్మరాజు, వాసుదేవుని కోరతాడు....

ఆ తరువాత)

బావా! సంజయుడి మాటలూ, నీ అభిప్రాయాలూ తెలుసుకున్నాను. నీ మనస్సు ధర్మబద్ధమైవుంది. వారు శత్రుభావం విడవరనీ తెలుసు.

భీష్మ ద్రోణులు తమ పక్షంలో ఉన్నారనే అహంకారంతో ఉన్నారు.

ఇంతకూ ఏ క్లేశం లేకుండా చేజిక్కిన రాజ్యాన్ని అనుభవిస్తున్న వారు, చేజేతులా నీకు ధారపోస్తారా! ఎన్ని అపనిందలు మీదపడినా వారు తమ దుర్బుద్ధిని విడువరు.

నువ్వు దైన్యాన్ని విడిచి సమరం సాగించి విజయలక్ష్మిని స్వీకరించు, శత్రు సంహారం ఇహపర శ్రేయస్కరం. అందువల్ల నీ కీర్తి చిరస్థాయిగా ఉంటుంది. అని క్షణం ఆగి–

ధర్మనందనా!

నాడు సభాభవనంలో గురువులున్నారు, మీ వంశ వృద్ధులున్నా అందరూ చూస్తుండగా ఎంత దారుణం సాగించారు. అయినా నేటికీ పశ్చాత్తాపం లేదు. అటువంటివారు బంధువులని జాలిపడ్డం అనవసరం.

ఆ దుర్మార్గుల క్రూర కృత్యాలూ, గర్వమూ విన్న వారెవరికైనా అసహ్యమూ, ద్వేషమూ కలుగుతాయి.

మాయా ద్యూతం సాగించి మిమ్ము అడవులకు పంపుతూ, దుర్యోధన, దుశ్శాసన, శకుని, కర్ణులు ఎటువంటి పరుషవాక్యాలు పలికారో అవి మన నోట పలకగలమా! ఆ మాటలు విన్నవారందరూ ధృతరాష్ట్రుని దూషించారు. సత్యానికి కట్టుబడి మీరు అన్ని క్లేశాలు పడవలసివచ్చింది కదా అని ఎంత కుమిలిపోయారు!

ఇంతకాలం చేసిన దుర్మార్గాలు వారిని దైనోపహతులను చేశాయి. వారిని ఓడించడం పెద్ద కష్టం కాదు. క్రూరాత్ములైన వారిని ఎవరైనా సంహరించవచ్చు. పాపాత్ములను పాములను చంపినట్లు నిర్దయతో సంహరించాలి.

భీష్మపితామహులకూ, ధృతరాష్ట్రునికీ సంతోషం కలిగించడం మంచిదే. ఇదే నీ అంతరంగం అని నేను వారికి చెప్పడానికి వెడుతున్నాను.

అక్కడ సభాభవనంలోని బంధుమిత్రులకు చక్రవర్తులందరికీ నీ ధర్మనిష్ట, పుణ్యప్రవర్తనం విశదం చేస్తాను.

నా మాటలు దుర్యోధనుడు వినడు. వినక ఊరుకుంటాడా, నోటికి వచ్చినట్లు ప్రేలుతాడు. మీ పెద్దనాన్నగారు వాడిని మందలించలేడు. అప్పుడక్కడి వారికి ఇంతకాలం మీరు అనుభవించిన కష్టాలు గుర్తుకు వచ్చి వారినే నిందిస్తారు. అది చాలు మనకు.

అయినా శక్తివంచన లేకుండా సంధికే ప్రయత్నిస్తాను. అది జరిగితే సంతోషం.

వ్యవహారం తలక్రిందులైతే అక్కడివారి అభిప్రాయాలేవిధంగా ఉన్నాయో, వారి బలాబలాలు ఎలా ఉన్నాయో గ్రహించి మనకు విజయం లభించే దారి ఏర్పాటు చేసి వస్తాను.

ఒక్కటి మాత్రం నిజం!

ఊపిరి ఆడుతుండగా దుర్యోధనుడు మీకు రాజ్యం ఇవ్వడు. యుద్ధం తప్పదు. ఆ

సూచనలు చాలా కనిపిస్తున్నాయి. నువ్వు విచారించక సంతోషంతో ఉండు అన్నాడు.

ఆ మాటలు విని భీముడు

ఏ విధంగా అయినా సంధి జరిపి వారూ మేమూ కలిసి సుఖంగా బ్రతికే మార్గం ఆలోచించు. అందుకే ప్రయత్నించు. అనగా చిరునవ్వు నవ్వి వాసుదేవుడు

భీముని నోట విచిత్రమైన మాటలు వినిపిస్తున్నాయే: అగ్నిహోత్రం చల్లబడినా, పర్వతాలు దూదిపింజల వలే తేలిపోయినా ఆశ్చర్యం లేదు. కానీ భీముడు మృదుమధురంగా శాంతిపాఠాలు వల్లిస్తుంటే నా నోటమాట రావడంలేదు.

**యుద్ధము మీది వేడ్కయు**
**మహోగ్ర విరోధుల నల్కజేయు**
**దర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి**
**సైపని యేపు రాజ్యసంసిద్ధి**
**నిజాగ్ర జన్మునకు చేయుతలంపును గల్గు**
**నీ వసంబద్ధములైన వాక్యములు**
**పల్కుట యొప్పునె కీచకాంతకా!**

భయమంటే ఏమిటో తెలియని నీకు ఈ పిరికిమందు పోసిన వారెవరయ్యా! అనగా భీముడు ఆవేశంతో తన ప్రతాపం ప్రకటించాడు.

వాసుదేవుడు చిరునవ్వుతో

బావా! పరిహాసానికేదో అంటే ఇంత ఆవేశపడతావా!

మీ తమ్ముడు నన్ను సారథిగా రమ్మంటే సరే అన్నాను. యుద్ధంలో నీవంటి మహాయోధుని సాయం ఉంటుందని ఆశపడ్డాను.

యుద్ధంలో విజయం ప్రాప్తిస్తే ఆ కీర్తిలో నాకు భాగం ఉంటుందని కుతూహలపడ్డాను. అంటూ అర్జునుని వైపు తిరిగాడు.

వాసుదేవుని మాటల్లో చమత్కారం గమనించాలి. భీమసేనుడు శాంతిపాఠం వల్లిస్తుంటే ఆయనకు గిట్టలేదు. ఆ మాటను ఎంత చక్కగా చెప్పాడు.

భీమునివంటి యోధుని సాయంతో యుద్ధంలో విజయం సాధించాలి అంటున్నాడంటే భీముని పౌరుషాన్ని ఎలా ప్రకోపింపజేశాడో తెలుస్తుంది.

అఘటనాఘటన సమర్థుడైన చక్రధారికి ఒకరి సాయం కావాలా! బలవీర్య పరాక్రమాలున్నవారు దుర్మార్గులను సంహరించడానికి పూనుకోవాలి కాని శాంతిమంత్రాలు చదువుతూ కూర్చోరాదు. ఆ విధంగా వారికి కర్తవ్యం బోధించాడు.

అర్జునుని మాటలు కూడా మనం జాగ్రత్తగా వినాలి.

కృష్ణా! చెప్పవలసిన మాటలన్నీ అజాతశత్రుడు మా అన్నగారు చెప్పనే చెప్పారు. ఇంక మేం చెప్పవలసిందేముంది!

చెప్పగల యంత పట్టును
చెప్పె నీ కజాతశత్రుండు
వింటి వీ వా తెరంగు
మాకు నెల్లను పలుకంగ
మాటలొండు గలవె
యైనను చెప్పెద కన్నయంత

చెప్పవలసినదేమీ లేకపోయినా నాకు తోచిన మాటలు చెబుతాను అని ఆరంభించాడు.

అంతా మా అన్నగారు చెప్పారు. అయినా నా మాటలు కూడా విను అని ఆరంభించడంలో పెద్దలమీద గౌరవం ఉంచుతూనే మన అభిప్రాయం ప్రకటించే పద్ధతి అదీ నేర్చుకోవలసింది.

కృష్ణా!

మా పెద్దనాన్నగారు పరమలోభి. ఆయన మాకు భాగం ఇస్తాడా! ఆయన కొడుకున్నాడు దుర్యోధనుడు, వానిని మించిన పాపాచార పరాయణుడెవడయ్యా!

ఈ దశలో సంధి సాగదని నీ నిశ్చయం. అయినా నా గాండీవానికీ, దివ్యాస్త్రాలకు పనిలేకుండా మాకు సుఖంగా ఉండే దారి చూడు. నువ్వు కార్యరంగంలో దిగితే కీడురాని మాట నిజం.

పురుషకారానికి దైవంతోడు పడాలి. అయితే ఈ రెండూ నీ క్రీడలే కదా!

## ప్రతి ఆడపిల్లా ఇలా కావాలి !

(శ్రీకృష్ణుడు రాయబారానికి బయల్దేరబోతున్నాడు. పాండవులు తమ తమ అభిప్రాయాలను ఆయనకు వివరిస్తున్నారు)

వీరందరి మాటలూ ఒక యెత్తు ద్రుపదరాజనందన ఆవేశం మరొక యెత్తు. కురు గురు వృద్ధ బాంధవులున్న సభలో జరిపిన పరాభవం ఆమె హృదయంలో అగ్నిలా మండుతూనే ఉంది. పదమూడు సంవత్సరాలు అగ్నిజ్వాలలను ఓరిమితో అణుచుకుంది. ఇంక వాటికి శాంతి చెయ్యాలని నిశ్చయించుకుంది. ఆ స్థిర సంకల్పంతో వాసుదేవుని ముందుకు వస్తున్న ద్రౌపదిని చూపుతూ వ్యాసమునీంద్రుడు

**సర్వలక్షణ సంపన్నం**
**మహాభుజగ వర్చసం**
**కేశపక్షం వరారోహా**
**గృహ్యా వామేన పాణినా అన్నారు**

ఈ చిన్న శ్లోకంలోనే ఆమె రూపం మనకు సాక్షాత్కరిస్తుంది. ఆ రూపాన్ని తిక్కన్నగారు తెలుగు భాషలో–

**ద్రోవది బంధురంబయిన**
**క్రొమ్ముడి గ్రమ్మున నిడ్చి**
**వెండ్రుకల్ దావలచేతబూని**
**అసితచ్ఛని బొల్చు మహాభుజంగమో నా**
**విలసిల్లి వ్రేలగ, మనంబున పొంగు విషాద రోషముల్ కానగలేక**
**భాష్పములు పొంగ దిగ్గన లేచి ఆర్తయై**

అని ఉత్పలంలో అందించారు.

బుసకొడుతున్న నల్లత్రాచు పామువంటి జుట్టుముడి విప్పి ఎడమచేతితో ముందుకు చూపుతూ గద్గద కంఠంతో కన్నీరు విడుస్తూ వచ్చింది ద్రౌపది.

"దేవకీనందనా! నాడు సభాభవనంలో అంత పరాభవం చేసి, ఈనాడు సంజయుని చేత ధర్మపన్నాలు చెప్పి పంపిస్తే, వీరు విని, తమకు అయిదు గ్రామాలిచ్చినా చాలు, అని యాచిస్తారా! పాపం! దుర్యోధనుడు వీరి సోదరుడు కదా! ఆ మాత్రం దయతలవరా!

తమరుపడ్డ క్లేశాలన్నీ వీరు మరిచిపోగలరు, తమ్ముని మీద ప్రేమతో సహించి ఊరుకోనూ గలరు. కాని రాజ్యభాగం అందుకోకపోతే నలుగురూ ఏమంటారు? సిగ్గులేని అవివేకులని తూలనాడరా!

"గౌరవహీనంగా తమను తాము కించపరచుకొని సంధికి సిద్ధపడుతున్నారు. బావుంది, కాని సంధివల్ల వారికి లాభంకాని మనకు కాదే, ఇంతకూ ఏకీడైన సైరింపగా వారు బ్రాహ్మణులా! దురభిమానియైన సుయోధనుడు నీ మాటలు వినడు. వినక యుద్ధానికి కాలుదువ్వినా వీరు కాళ్ళూ చేతులూ ముడుచుకుని కారడవులకి వెడతారా!" ఆవేశంతో నేనేదో అంటున్నాను. మీరు బాగా ఆలోచించి మీ మంచితనానికి ఇబ్బంది రాకుండా వారితో సంధి చేసుకోండి. నా మాటలు లక్ష్య పెట్టకండి, మీ నిర్ణయానుసారం సాగండి.

'ఒక్కమాట, నేను పుట్టిన వంశం. మెట్టిన వంశం ఎటువంటిది? చేపట్టిన వారు సామాన్యులా! నా బిడ్డలు తక్కువవారా! ఇన్నిటినీ మించి సుభద్రకంటె నన్నే అభిమానంతో గౌరవంతో నన్ను చూసుకుంటున్నావే. ఇంతటి నన్ను ఏంచేశారయ్యా. రాజసూయయాగం ముగిసేవేళ అవభృథ స్నానంతో పరమ పవిత్రమైన ఈ కేశపాశం పట్టి ఒకడెవడో ఈ

అయిదుగురూ చూస్తుండగా సభాభవనానికి లాగుకొని వచ్చాడే! కులస్త్రీని ఇంత అవమానించడం విన్నావా!

కురువృద్ధులు, గురువృద్ధులు, మిత్ర బాంధవులందరూ ఉన్న సభాభవనానికి ఏకవస్త్రనైయున్న నన్ను (రజస్వలలు ఏకవస్త్రం ధరించడం ఆచారం) ఈడ్చుకొచ్చి దుశ్శాసనుడు అవమానిస్తుంటే వీరంతా చైతన్య శూన్యులై కూర్చుంటే నిన్ను స్మరించాను, గుర్తున్నదా! ఆ ఇంటి పెద్ద కోడలిని అని కూడా చూడకుండా నన్ను దాసిగా చేశారు, ఆ మహామహులు. వీరంతా వారిని సేవిస్తుంటే నేనా ఇంట్లో కోడరికం వెలగబెట్టాలా! వారి పాదాలు వత్తుతూ దాసీబ్రతుకు బ్రతకాలా!

వరమున **బుట్టితిన్ భరతవంశము జొచ్చితి**
**నందు పాండుభూవరునకు కోడలైతి**
**జనవంద్యుల బొందితి, నీతి విక్రమ**
**స్థిరులగు పుత్రులన్ బడసితిన్**
**సహజన్ముల ప్రాపుగాంచితిన్**
**సరసిజనాభ! ఇన్నిట ప్రశస్తికి నెక్కినదాన నెంతయున్**
**నీవు సుభద్రకంటె కడు నెయ్యము**
**గారవముం దలిర్ప సంభావన సేయుదట్టి నను**
**పంకజనాభ! యొకండు రాజసూయాభృధంబు నందు**
**శుచియై పెనుపొందిన వేణివట్టి**
**ఈ యేవురు చూడగా సభకు నీడ్చె**
**కులాంగన నిట్లొనర్తురే!**

"చూడవయ్యా, దుశ్శాసన దుర్మదాంధుని చేతులలో ఊడగా మిగిలిన పవిత్ర కేశాలు. ఈ పవిత్ర వేణిని మరువకుండా రేపు కురుసభలో నీ సంభాషణ సాగించు. ఈ జుట్టుమీద చెయ్యివేసిన దురాత్ముని శరీరం ఇంతలింతలు ముక్కముక్కలుగా రణరంగంలో పడివుండగా నా కంటితో చూడాలి. అప్పుడు కాని నా హృదయావేదన చల్లారదు. ఎందుకయ్యా గదాదండంతో ఈయనా, గాండీవంతో ఆయనా..... వీరభయులూవిక్రమించి సంగ్రామ భూమిలో రక్తప్రవాహంలో విలవిల్లాడే దుర్యోధనుని శవాన్ని ధర్మరాజుతో కలిసి చూసే అదృష్టం మాకు కలిగించకపోతే!

"పదమూడు సంవత్సరాలుగా పరాభవాగ్ని జ్వలిస్తూనే వుంది, నీవంటి తోబుట్టువు, ఇంత పరాక్రమంగల భర్తలు పూనుకుని దుష్టశిక్షణ సాగించి ఆ అవమానాన్ని చల్లార్చండి" అంది.

ద్రౌపదీదేవి నోట వెలువడిన ప్రతిపదం యౌవనంలో అడుగు పెట్టే పిల్లలచేత

కంఠోపాఠం చేయించి దాని అర్థాన్ని వారి గుండెకు ఎక్కించాలి. దేశంలో దుశ్శాసన, కీచక సంతానం పెరుగుతున్న ఈ రోజులలో ఆడపిల్లలందరూ ద్రౌపదీదేవి వలె ప్రతీకారాన్ని కోరాలి. పరాభవించిన దుశ్శాసనుల ముందు తలవంచడం మానాలి.

అందుకోసమే భారతం–

భారతం అంతా చదవలేకపోతే ఉద్యోగపర్వమైనా చదివించండి. దాని సారాంశం గుండెకెక్కించండి. ఇది మానవజాతి ఉన్నంతకాలం మహేతిహాసంగా ఎందుకు ఇన్నివేల సంవత్సరాలుగా కోట్లాది ప్రజలను ఆకర్షిస్తున్నదో గ్రహించి అది ఇచ్చే సందేశాన్ని ఆచరణలో పెట్టండి.

# కుటుంబ జీవన ధర్మం

(రాయబారానికి బయల్దేరబోతున్న శ్రీకృష్ణుడికి ద్రౌపది తన మానసిక వ్యధను తెలియచేసింది. ఆ తర్వాత....)

ధర్మజ, భీమార్జునాదులు మాట్లాడినంతసేపు అంతగా మాట్లాడని వాసుదేవుడు ద్రౌపదీ సందేశం వింటూ ఎంత స్పందించాడో సావధానంగా చూడండి. రాయబారానికి వెడుతున్న కృష్ణుని మనస్సు ఈ సన్నివేశంలో స్పష్టం చేశాడు.

భారతకథకు మూలం జూదం. ద్యూతక్రీడ సాగి ఉండకపోతే ఇంతకథ పెరిగేది కాదు. ద్యూతం సాగినా ఇంత పెరిగేది కాదు, ధర్మరాజు అంతా పందెం పెట్టి ఉండకపోతే పందెం పెట్టినా కథ సాగేదికాదు. దుశ్శాసనుడు అంత దారుణానికి దూకి ఉండకపోతే సభాపర్వంలో ఆగిపోవలసిన భారతం ద్రౌపదీ వస్త్రాపహరణం కారణంగా కురుక్షేత్రంలో సర్వనాశన పర్యంతం నడిచింది.

అంటే ఒక కులస్త్రీని పరాభవించిన కారణంగా వంశనాశనం అయింది. వంశమే కాదు. వారి బంధుమిత్రులు కూడా నశించారు. ఇంతకూ కారణమైన ద్రౌపది తన పరాభవానికి కోరిన ప్రతీకారాన్ని జరపడానికే వాసుదేవుడు సంకల్పించాడు. జూదంలో ఓడిపోయిన ధర్మరాజు మీద కృష్ణునికి సానుభూతిలేదు. ఓడినవాని భార్యను అవమానించిన దుర్మార్గులను శిక్షించి తీరాలి. అందుకే పాంచాలీ సందేశం విని కృష్ణుడు :

"అమ్మాయి, ఎందుకు శోకిస్తావు? కురువంశ స్త్రీలరోదనం వింటూ కలకలనవ్వే రోజులు దగ్గరలో ఉన్నాయి.

ధర్మరాజు ఆజ్ఞప్రకారం భీమార్జునులతో వెళ్ళి శత్రువులను నిశ్శేషం చేయక తప్పదు. దురాత్ములైన దుర్యోధన సోదరులు రాజ్యభాగం ఇవ్వరుగాక ఇవ్వరు.

**యమ మహిష ఘంటికానాదము**
**విన కౌతూహలంబు తళుకొత్తెడు**
**చిత్తములుగల కౌరవుల కిష్టములగునే**
**సంధి కార్యశాంతివచనముల్**

యముని వాహనమైన దున్నపోతు మెడలోని గంటల చప్పుడువినే కోరికతో వున్నవారికి శాంతిసూక్తాలు వినిపిస్తాయా! దైవ నిర్ణయం అలాగే ఉన్నదని పెద్దలంటున్నారు. మేరువు తిరగబడినా ఈ నిర్ణయం మారదు. శత్రువులను సంహరించి పాండవులు విజయలక్ష్మీయుతులై రాజభోగాలు అనుభవించే ఘడియలు దూరంలో లేవు. నిశ్చింతగా ఉండు అన్నాడు.

ఆ పూటకు సమాలోచనలు ముగిశాయి. రాత్రి విశ్రమించి ఉదయం ప్రయాణ సన్నాహాలు సాగించాడు వాసుదేవుడు. సూర్యుని ఉపాసించి, అగ్నిహోత్రుని ఆరాధించి, బ్రాహ్మణులకు ప్రణామాలు చేసి ఆశీర్వారాలందుకుని సాత్యకిని పిలిచి :

"తమ్ముడూ, దుర్యోధనుడు దుష్టాత్ముడు, దుష్టుని మిత్రులు కూడా కుటిల బుద్ధులే అవుతారు. అందుచేత, చక్రం, గద రథం మీద పెట్టించు అన్నాడు.

(ధర్మరక్షణార్థం అవతరించిన వాసుదేవుని చూస్తూ, ధర్మ సంహితగా పంచమ వేదంగా వ్యాసమునిచంద్రుడిచ్చిన భారతం చదువుతున్నాం అని మరచిపోకండి.

వ్యాసుని కంటె ధర్మసూక్ష్మం తెలిసినవారెవరు? వాసుదేవుని మించి ధర్మ సంస్థాపనం చేయగలవారెవరు? అందుచేత ఆయన చెప్పింది ధర్మమనీ ఈయన చేసింది ధర్మమనీ విశ్వసించలేనివారు సంశయగ్రస్త మతులే! సంశయాత్మా వినశ్యతి అనడం కంటె దారిలేదు)

కథలోకి నడుద్దాం.

రథం కదలబోతుండగా ధర్మరాజు కృష్ణుని సమీపించి

"బావా! నీ రాక తెలియగానే మా అమ్మ కుంతీదేవి హృదయం పొంగి పులకిస్తుంది. ముందుగా ఆవిడను చూసి మా అందరి కుశలం చెప్పు."

లక్క ఇల్లు తగులబడినది మొదలు మా అమ్మ దుఃఖసాగరంలోనే ఉంది. మేము వనవాసానికి బయలుదేరుతూంటే కన్నీరు మున్నీరుగా దీన వదనంతో సాగనంపింది. వేడిపాలలో పడిన బల్లిలా ఆవిడ కృశించి ఉంటుంది. ఆవిడకు దుఃఖించవలసిన రోజులు చివరకొచ్చాయనీ, సుఖంగా తనబిడ్డలతో రాజభోగాలు అనుభవించవచ్చుననీ, ఆ శుభ సమయం దగ్గరలోనే ఉన్నదనీ మీ మేనత్తను ఓదార్చు" అన్నాడు.

ఈ సన్నివేశాన్ని పరిశీలించినపుడు మహాభారతం మన కుటుంబ జీవన ధర్మాన్ని ఎలా బోధించిందో తెలుస్తుంది.

ధర్మరాజు ఆ యింటి పెద్దకొడుకు. అంటే తండ్రి అనంతరం ఆ స్థానం ఆయనది.

కన్నతల్లి కష్టసుఖాలు, తోబుట్టినవారి యోగక్షేమాలు చూడడం పెద్దవాని బాధ్యత. అంతేకాని అన్నిటినీవదిలి పెత్తనం దొరికింది కదా అని సుఖంగా భోగాలు అనుభవించడం పెద్దకొడుకు చెయ్యరాదని వాచ్యం చెయ్యకుండా ధర్మరాజు తన బాధ్యతను ఎలా నిర్వహిస్తున్నాడో విశదం చేసి భారతం మన కర్తవ్యాన్ని గుర్తుచేసింది.

వాస్తవానికి ఈ సమయంలో కుంతీదేవి గుర్తురాదు. మరొకడెవడయినా భారతం వ్రాస్తే, అందుకే వ్యాసమునీంద్రునికి మానవజాతి అంజలి ఘటించాలి.

రథం సాగుతోంది.

## తగదిది ! తగదిది !

హస్తినాపురానికి వాసుదేవుడు వస్తున్న విషయం విన్నాడు ధృతరాష్ట్రుడు. భీష్మ, ద్రోణ, విదుర, కృప, దుర్యోధన, కర్ణ, శకుని, సైంధవులను పిలిపించి : పాండవ రాయబారిగా వాసుదేవుడు మన నగరానికి రావడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. అందరూ ఆయన దగ్గరకు వెళ్ళాలి. కాని ఆయన మన దగ్గరకు రావడం ఎంత అదృష్టం.

కృష్ణుడు అనుగ్రహించినవారు అదృష్టవంతులు. ఆయన ఆగ్రహించాడో వాని దురదృష్టం ఇంతటిదని చెప్పలేము.

నాయనా, దుర్యోధనా! ఆయనను సముచితంగా ఆరాధించి సత్కరించడానికి అవశ్యమైన పనులన్నీ సక్రమంగా పూర్తిచేయించు.

మన భవనాలన్నీ మంగళప్రదంగా కనిపించేటట్లు అలంకరించి, నీ వైభవం ఎంతటిదో చూపిస్తూనే ఆయన మీద మనకెంత అనురాగం ఉన్నదో వ్యక్తం అయ్యేటట్లు ప్రవర్తించాలి. అనగానే దుర్యోధనుడు సేవకులను పిలిపించి :

అలుకుడు, మృగమదమున ముగ్గులు పెట్టుడు,

కప్పురమున కుంకుమమున గోడలు పూయుడు. మణిదామకములు గట్టుడు పెద్దకూటమున సొంపార!"

నగర వీధులన్నీ అలికి కస్తూరితో ముగ్గులు వేయించండి. కర్పూరంతో కుంకుమతో గోడలకు పూతలు పెట్టించండి. సభాభవనంలో మణులు నిండిన హారాలు వ్రేలాడదీయండి.

నా భవనం, దుశ్శాసన సౌధం అద్భుత శిల్పాలతో కనులు మిరుమిట్లు గొలిపేలా ఉండాలి. ఈ రాత్రికి కృష్ణుడు వృక్షస్థలం చేరుతాడు, కనుక ముందుగా అక్కడ విడిది ఏర్పాట్లు చేయండి. నగరం అంతా ఉత్సవ శోభతో అలరారాలి. సువాసన కనేక పూలదండలు, చీనాంబరాలు, మణిరత్నఖచిత, సువర్ణ భూషణాలు సిద్ధం చేయించండి.

రుచికరమైన పిండివంటలతో విందుకు సన్నాహాలు సాగించండి" అని అందరినీ పంపించాడు.

అప్పుడు ధృతరాష్ట్రుడు విదురుని వైపు తిరిగి :

"మహామంత్రీ, మణిమయరథాలు, చక్కని గుర్రాలు, ఏనుగులు, రత్నహారాలు, సుందర యువతీ జనం కృష్ణునికి కానుకగా ఇస్తాను. రాజభవనంలో దుర్యోధన, దుశ్శాసనుల గృహాలలో ఆయన కంటికి ఏది నచ్చితే అది ఆయనకు అర్పించాలి" అన్నాడు.

విదురుడు! మహారాజా! వాసుదేవుని సంప్రీతుని చేయడం మన పనికాదు. అయితే పాండవులు అయిదు గ్రామాలడిగితే ఇవ్వడానికి అంగీకరించని తమరు కృష్ణునికి ఇన్ని కానుకలెందుకు ధారపోయాలనుకుంటున్నారు?

ఇంతకూ ఆయనకు లంచం ఇచ్చి వ్యవహారం మనకు అనుకూలం చేసుకుందామని మీ అభిప్రాయం, కాని మేరు పర్వతాన్ని వాసుదేవుని కిచ్చినా ఆయన అర్జునుని విడిచి పెట్టడు. అర్జునునికి ఆయన యందున్న భక్తి, వానిమీద ఈయనకున్న అభిమానం తమకు తెలియదా! ఆయన మన దగ్గర అతిథి మర్యాదానుసారం అర్ఘ్యపాద్యాలు అందుకుంటాడు. కుశల ప్రశ్నలు వింటాడు, అంతకు మించి ఏదీ స్వీకరించడు.

"ఏ పనిమీద ఆయన వస్తున్నాడో అది సక్రమంగా నెరవేర్చడం కంటె ఆయనకు మరేదీ అవసరం లేదు." అని మహారాజును కూడా మందలించాడు. ప్రభువు మాటకు ఎదురుచెప్తే తల తరిగే రాజస్వామ్యంలో సైతం నిర్భయంగా తన అభిప్రాయాన్ని ప్రకటించి, రాజుగారి దుర్బుద్ధిని నిర్మొహమాటంగా బైటపెట్టిన మంత్రివిదురుడు. కనుకనే ఆ విద్వాంసుడు బోధించిన నీతి నేటికీ విదుర నీతిగా మేధావులు పాఠం చెప్పి పిల్లలను సక్రమంగా నడుపుతున్నారు.

తన శ్రేయస్సును కోరి హితవు చెప్పే మంత్రి మాట విననివాడు, ఎలా నాశనమవుతాడో ధృతరాష్ట్రుని నుండి నేటి మానవుడు నేర్చుకోవాలి.

ఈ ఉపదేశాన్ని విని విననట్లు ధృతరాష్ట్రుడు ఊరుకున్నాడు, వాని పెద్దకొడుకు దుర్యోధనునికి ఆ మాత్రం వివేకం లేక :

"మహారాజా! విదురుడు చెప్పింది సత్యం, కృష్ణుడు పాండవులను విడిచిరాడు. ఇది తెలిసికూడా మనం బహుమానాలిస్తే నలుగురూ ఏమంటారు. మనం భయపడి ఈ దశకు దిగిపోయామంటారు.

ఆయన పూజార్హుడని అంగీకరిస్తాను. అంతమాత్రాన రత్నాలు, మణులూ ఇస్తే మన అల్పత్వం బైటపడుతుంది. శత్రువులకు చులకనఅవుతాం" అన్నారు

భీష్ముడు : ధృతరాష్ట్రా! మీరాయనకు ఇచ్చినా ఇవ్వకపోయినా దాన్ని గురించి ఆలోచించడు. ఆయన చెయ్యదలుచుకున్నది చేస్తాడు. కనుక ఆయన చెప్పినట్లు చేయడం

శ్రేయస్కరం. ఆయన ధర్మం, అర్ధం విడిచి మాట్లాడదు. ఈ పురుషార్థాలు చెవినిబెట్టి నడుచుకోవడం మేలు.

దుర్యోధనుడు : "పితామహా! కృష్ణుడు రాజ్యభాగం ఇమ్మంటాడు. అది కుదరదు. నాకొక ఊహవున్నది. పాండవులకు కృష్ణుడొక్కడే అండ. రేపాయన రాగానే ఇక్కడ బంధిస్తాను. అంతలో పాండవులు రెక్కలు విరిగిన పక్షులై నన్నాశ్రయిస్తారు. వారితోపాటు పాంచాల, యాదవ వంశాలు నావెనక చేరతాయి". ఆ మాటలు విన్న ధృతరాష్ట్రునితో సహా అక్కడి వారందరూ వాని ఆలోచనకు లోలోపల అసహ్యించుకుని బాధపడ్డారు.

ధృతరాష్ట్రుడు : ఓరి పాపాత్ముడా! వాసుదేవుడు మనకు చేసిన కీడు లేదు. ఆయన రాకవల్ల హాని లేదు. ఈ దశలో ఇంత దుర్బుద్ధి ఎందుకు పుట్టింది?

భీష్ముడు : ధృతరాష్ట్రా! నీ కొడుకు ప్రాణాపాయానికి సిద్ధపడే ఊహ చేస్తున్నాడు వానితోపాటు వాని మంత్రులకు వినాశం సిద్ధమైంది.

ఈ ఊహ కలగడమే నాశనహేతువు. ఇంక ఈ మాటలు వింటూ కూర్చోలే"ను. అని సభ నుంచి వెళ్ళిపోయాడు.

ధృతరాష్ట్రుడు : "నాయినా! ఇటువంటి దురాలోచన పుట్టనేకూడదు. పుడితే చేసి తీరతావు అది సర్వనాశన హేతువు. నామాట విని ఆ ఆలోచన విడిచిపెట్టు" అని కొలువు చాలించాడు.

## అమ్మ ఏం చెప్పింది.

మరునాడు కృష్ణుడు హస్తినాపురంలో అడుగు పెడుతుండగా భీష్మ, ద్రోణ, కృప, బాహ్లిక, విదురులతో తన కుమారులందరినీ కృష్ణునికి స్వాగతమర్యాదలు నడపడానికి పంపాడు ధృతరాష్ట్రుడు, దుర్యోధనుని తప్ప.

సరే, ఆయన వచ్చాడు. అందరినీ ఉచితరీతిని పలకరించి, అర్ఘ్యపాదాలు స్వీకరించి, కుశల ప్రశ్నలు ముగించి, "మామా! ఈ పూట విదురుని ఇంట విశ్రాంతి తీసుకుని, చూడవలసిన ఆప్తులందరినీ చూసి రేపు పాండవుల అభిప్రాయం వివరిస్తాను." అని వెళ్ళాడు. విదురుని ఇంట కొంతసేపు పాండవుల క్షేమ సమాచారాలు చెప్పి కుంతీదేవిని చూడడానికి వెళ్ళాడు.

కుంతీదేవి తన ఇంటికి వచ్చిన వాసుదేవుని దగ్గరగా తీసుకుని కన్నీరు తుడుచుకుంటూ కృష్ణుని ఓదార్పు మాటలతో కొంత తేరుకుని ప్రక్కన కూర్చోబెట్టి :

"దేవకీనందనా! నా బిడ్డలు నీ శిక్షణలో నీతిమంతులూ, శూరులూ, పుణ్యకార్యరతులూ

అయ్యారు. హాయిగా సేవకుల మధ్య అనుభవించవలసినవారు నాకు దూరమై అడవుల పాలయారు. నా చేతితో వడ్డిస్తుంటే తిని సుఖంగా నిద్రించవలసిన బిడ్డలు కందమూల ఫలాలు తింటూ బండరాళ్ళ మీద పాముపుట్టల మధ్య భీకరధ్వనులు వింటూ నిద్రలేస్తున్నారు. చిన్ననాడే తండ్రిలేని వారయారు. ఇప్పుడు తల్లికికూడా దూరమయ్యారు. అజ్ఞాతవాసంలో ఎన్ని దురవస్థలు పడ్డారు! సరే, ప్రస్తుతం వారు సుఖంగా వున్నారా? కొడుకుల కంటే కోడలే నన్నెంతో ఆదరించి గౌరవించేది. ఉత్తమ క్షత్రియ వంశంలో పుట్టి పుణ్యశీలయని పేరు పొందిన ఆ రాజనందనను నిండు కొలువులో అంత పరాభవిస్తుంటే చూస్తూ సహించాను. అంతకంటే అవమానం ఉన్నదా! అంత జరుగుతుంటే విదురుడొక్కడే నోరు విప్పి 'ఇది ధర్మంకాదు, ఈ అత్యాచారాలు సాగించకండి' అన్నాడు. మిగిలిన పెద్దలు పెదవి విప్పలేకపోయారే!

కృష్ణా! ఈ కష్టాలన్నీ ఒక ఎత్తు. ఈ పదమూడేళ్ళూ బావగారి కొడుకు దయాహీనంగా పెడుతుంటే తినడం ఒక ఎత్తు. నా బిడ్డలను ఎలా చూసుకున్నానో వారినీ అంత ప్రేమతో చూసినా నన్నింత కష్టపెట్టిన దానిఫలం అనుభవించకపోతారా!

ఇంతకీ వాసుదేవా! మా బావగారూ, ఆయన పిల్లలూ, కురువృద్ధులు, బాహ్లికులూ, పితామహ భీష్ములూ ఏదో చేశారనుకోవడం దేనికి! అటువంటి క్రూరులకు ఇంటికోడలుగా నన్ను పంపిన పుట్టింటి వారిని తిట్టుకుంటున్నానయ్యా!" అంది.

మానవ మనస్తత్వాన్ని మహాభారత సంహితా రచయిత వ్యాసమహర్షి ఎంత నిశితంగా పరిశీలించాడో ఈ వాక్యాలలో కనిపిస్తుంది.

కష్టాలలో ఉన్నప్పుడు బంధువులు కంటబడితే ఆడవారు ఏడవడం సామాన్య విషయం. నేటికీ చూస్తున్నాం. కన్నతల్లి తన బిడ్డల కష్టాలు తలుచుకు బాధపడడం మాతృత్వం వున్నంత కాలం కనిపిస్తూనే ఉంటుంది. భరించలేని బాధలు మీదపడితే అత్తవారింటిని దూషించకుండా, అటువంటి ఇంటికోడలిగా పంపిన పుట్టింటివారినే నిందించడం నేటికీ వింటూనే ఉంటాం. ఏరికోరి ఈ కొంపలో పడేశారు. ఈ పెళ్ళిచేసి నా గొంతు కోశారు అని పుట్టింటివారిని తిట్టుకునే ఆడవారు కనిపించని చోటుండదు.

మహాభారతంలోని కుంతీదేవి నాటికీ, నేటికీ మాతృత్వానికి స్త్రీ జాతికి ప్రతినిధిగా కనిపిస్తూనే ఉంటుంది.

నరమాంసాలున్న ప్రాణి, రాగద్వేషాలున్న వ్యక్తి ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో ఎలా మాట్లాడుతుందో భారతం మనకు ప్రదర్శించింది కనుకనే మనజాతి ఇతిహాసంగా నిలిచింది, నిలుస్తుంది.

అలా కొంతసేపు దుఃఖంతో మాట్లాడి కన్నీరు ఒత్తుకుని గుండెదిటపు చేసుకుని కుంతీదేవి :

"కృష్ణా! ధర్మరాజుతో నా మాటగా చెప్పవలసినది విను.

రాజపుత్రుడైన వాడు దైన్యంతో చెయ్యిజాపి యాచనచెయ్యరాదనీ అగ్నికి ఉష్ణం గుణం అయినట్లు రాజులు బాహుబలంతో జీవించాలని చెప్పు.

రాచబిడ్డ సంతానాన్ని ఏ మహోద్దేశంతో కంటుందో అది నెరవేర్చవలసిన సమయం వచ్చిందని భీమార్జునులకు చెప్పు. భుజబలంతో బ్రతకాలేకాని దయనీయంగా ఉండడం రాజవంశ లక్షణం కాదని నకుల సహదేవులకు చెప్పు.

అన్నిటికంటే ప్రధానం ద్రౌపదీదేవి చెప్పినట్లు నడుచుకోమన్నానని వారందరికీ నా ఆజ్ఞగా చెప్పు" అంది.

## పనికి ఫలితంతో పనిలేదు.

(హస్తినాపురానికి రాయబారం వెళ్ళిన శ్రీకృష్ణుడు తొలుత కుంతీదేవిని పరామర్శించాడు. కుంతీదేవి తన కుమారుల బాగోగులు, కోడలి యోగక్షేమాలు విచారించింది. కృష్ణుని వద్ద ఆమె తన హృదయావేదనను వెలిబుచ్చుకుంది. మాతృత్వం తొణికిసలాడే ఆమె మాటలు విన్న వాసుదేవుడు)

అత్తా, నీ అంతటి పుణ్యచరిత ఎవరున్నారు! పుట్టినింటికీ మెట్టినఇంటికీ కీర్తి తెచ్చిన గుణవంతురాలవు, ధీర హృదయవు, నిశ్చింతగా వుండు. నేను నీ మాటలన్నీ నెరవేరుస్తాను. నీ బిడ్డలు వీరులవలె నిలబడి సుఖభోగాలు సాగించుకుంటారుగానీ ఇతర మార్గాలు త్రొక్కరు. ఉత్సాహంతో శత్రువంశ నాశనం చేసి సామ్రాజ్యం సాధించుకుంటారు. ఆనాడు వారిని సంతోషంతో చూడగలవు అది జరిపించడానికీ నేనున్నాను" అని సెలవు తీసుకున్నాడు.

కృష్ణుడు భవనం వీడి వచ్చేసరికి, కృతవర్మ, సాత్యకి రథంమీద సిద్ధంగా వున్నారు. వారితో కలిసి దుర్యోధనుని భవనానికి వెళ్ళాడు. కృష్ణుని రథం కనుచూపుమేరలో ఉండగా ద్వారపాలకులు లోపలకు వెళ్ళి విషయం చెప్పి అనుమతి పొంది, ద్వారంలో నిలబడి వాసుదేవునికి స్వాగతం పలికి సగౌరవంగా తీసుకువెళ్ళారు.

అక్కడ వంశవృద్ధులు బాహ్లికుడు, భీష్ముడు, గురువృద్ధులు ద్రోణాచార్య, కృపాచార్యులు, కర్ణ, శకుని, సైంధవ, దుశ్శాసన, వికర్ణాదులు, నానాదేశాల చక్రవర్తులు ఆసనాలు దిగి ఎదురేగి కృష్ణునికి స్వాగతం పలికారు. దుర్యోధనుడు గాఢాలింగనంతో కృష్ణుని తీసుకువచ్చి బంగారుశయ్యమీద కూర్చోబెట్టి అతిధి మర్యాదలు జరిపారు. కుశలప్రశ్నలు సాగుతుండగా దుర్యోధనుడు.

"దేవకీనందనా! ఈ పూట మా ఇంట విందుభోజనం. రుచికరమైన భక్ష్యభోజ్యాదులు

సిద్ధం చేయించాను" అని వంటకాల విశేషాలు రుచులూరేట్లు చెపుతుంటే వాసుదేవుడు నవ్వి–

"దుర్యోధనా! దూత కార్యానికి వచ్చినవారు ముందుగా విందులూ, విలాసాలూ సాగించరాదని ఎరుగవా! నా పని సానుకూలం చేసిన తరువాత హాయిగా విందులూ, వినోదాలూ" అన్నాడు.

"కృష్ణా ! వచ్చిన పని సఫలమైనా విఫలమైనా అప్పుడు చూడవచ్చు. అంతేకాని ఇప్పుడే ముక్కుకి త్రాడుపోసి కాలుదువ్వడం దేనికి? వచ్చినవాడవు సుఖంగా భోజనంచేసి అన్ని విషయాలూ మాట్లాడుకోవచ్చుగా" అని దుర్యోధనుడు అనగా, వాసుదేవుడు చిరునవ్వుతో ఆతని చెయ్యి పట్టుకుని–

"దుర్యోధనా! ప్రేమతో ఆహ్వానించి ఆదరంతో పెట్టే భోజనం ఉత్తమం. మనకు విపత్తులు సంభవించి గతిలేని దశలో పడితే పెట్టే భోజనం కూడా మంచిదే. ఇప్పుడు మన మధ్య ప్రేమ లేదు. మేము ఆపదలో ఉన్నాము. అదీగాక శత్రువుల ఇంట ఏది పెట్టినా అది అమృతమైనా అనుమానించాలి. మరొక్కమాట! శత్రువుకు భోజనం ఎన్నడూ పెట్టరాదు. ఎందుకంటే ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందో తెలీదుకదా! ఈ భోజనమే – ఆ విపత్తుకు కారణమని నలుగురూ అంటారు. మన మధ్య శత్రుత్వం ఎక్కడిదంటావా! నీకు పాండవద్వేషం వున్నది, వారు నాకు ఇష్టులు. చిన్ననాటి నుండి వారిని నానా హింసలూ పెట్టావు. ధర్మపరులైన సోదరుల మీద వైరం తగదని కూడా ఎరగని నీ ఇంట మీ ఎవరి అతిధ్యమూ అంగీకరించను. విదురుని ఇంట ఉంటాను. అక్కడే తింటాను" అని వెళ్ళాడు.

శ్రీకృష్ణుడు ఆదరంతో విదురుని ఇంట భుజించి ఇష్టాలాపాలు ఆడుకుంటుండగా నగరంలోని సంగీత కళాకోవిదులూ, శాస్త్ర, సాహిత్య విద్యాపారంగులూ వచ్చి తమ విద్యలు ప్రదర్శించి ఆయనకు ఆహ్లాదం కలిగించి, బహుమానాలందుకుని వెళ్ళారు. హంసతూలికా తల్పం మీద శ్రీకృష్ణుడు విశ్రమించగా ఉచితమైన ఆసనంమీద విదురుడు కూర్చుని–

'వాసుదేవా! ఇదేదో పెద్ద పని అని నువ్వు రావడమా! నీచుడు, దుష్టబుద్ధీ అయిన దుర్యోధనుడు నీమాట వింటాడా? ఆ ధూర్తుల మాటలకు ఎదురుచెప్పేవారు లేరు. నీ శక్తిసామర్థ్యాలు నాకు తెలుసు. కాని వారు ఏ దుస్సాహసం చేస్తారో' అని మెల్లగా కౌరవుల దురూహలు చెప్పాడు.

వాసుదేవుడు సావధానంగా విని.

'మహామంత్రీ! కన్న తండ్రివలె హితవు చెప్పావు. నీ దూరదృష్టి నాకు తెలుసు. భూమండలాన్ని మృత్యుముఖంలోకి నడిపించేవారి మూఢత్వాన్ని తగ్గించి సన్మార్గంలో పెట్టడం కంటే పుణ్యకార్యం లేదు.

చుట్టములలోన నొప్పమి పుట్టినప్పుడడ్డపడి వారి

'తోడ కొట్లాడియైన
దాని నుడుపంగ జొరకున్న వాని
క్రూరకర్ముడని చెప్పుదురు
కర్మకాండ విదులు

'బంధువుల మధ్య కలహం సంభవిస్తే వారిని దండించియైనా దారికి తీసుకురావాలి. ఆ పని చెయ్యకపోవడం కూడా క్రూరత్వమేనని విద్వాంసులు ఘోషిస్తున్నారు. అన్నదమ్ముల పిల్లల మధ్య శాంతి సాధించడానికి అవసరమైన కృషి చేస్తాను. రేపు సభలో వాని మంత్రిబాంధవ సమక్షంలో ధర్మార్థ చర్చ నడుపుతాను. లోకకళ్యాణ మార్గం చెబుతాను. అయినా వీరు నన్ను పాండవ పక్షపాతిగా భావిస్తే చేసేదేమీ లేదు. ఇప్పుడు నేనీ రాయబారం నడపకపోతే, కృష్ణుడు పూనుకుని వుంటే వ్యవహారం శాంతి ముఖంగా నడవకపోవునా! అని అవివేకులు నన్ను వేలెత్తి చూపుతారు. దుర్యోధనాదులు నా హితవచనం విన్నారా సుఖంగా బ్రతుకగలరు! కాక, నీ భావనానుసారం వినరనుకో, వినక నాకు హాని తలపెట్టారనుకో, అప్పుడు 'నా ముందు నిలువగలరా?' అని నిద్రకు ఉపక్రమించాడు.

తెల్లారింది.

మంగళగీతాలు వింటూ వాసుదేవుడు మేలుకొని కాలకృత్యాలు నిర్వర్తించి, సంధ్యావందన, అగ్నిహోత్రాలు యధావిధిగా నిర్వహించి వెలువలకు వచ్చాడు.

అప్పటికే సాత్యకీ, కృతవర్మ సిద్ధంగా ఉన్నారు.

కర్ణ, శకుని, దుశ్శాసనులు వెంటరాగా దుర్యోధనుడు వచ్చి :

'వాసుదేవా! మహారాజు బంధుమిత్ర పరివారంతో సభాభవనానికి వచ్చి నీ కోసం ఎదురుచూస్తున్నా' రనగానే బయలుదేరాడు.

భవనద్వారం దగ్గర నిలబడిన విదురుని మీద ఒక చెయ్యి, సాత్యకి భుజంమీద ఒక చెయ్యివేసి లోపలకు వెళ్ళాడు.

స్వాగతమర్యాదలు నడిపిన ధృతరాష్ట్రాదులందరినీ అభినందించి, తనకు నిర్దిష్టమైన సువర్ణాసనం మీద ఆసీనుడయ్యాడు. సాత్యకి, కృతవర్మ ఇరువంకలా కూర్చున్నారు. దగ్గరలోనే దుర్యోధన – కర్ణులు ఒకే ఆసనం అలంకరించారు.

**అంబుద శుభగాత్రుం**
**బీతాంబరధరు కమలదళ నిభాక్షున్**
**హరి చూడంబడసి లోచనము లమృతం**
**బానిన మాడ్కి నమ్మదంబున తేలెన్ !!**

అందరూ నీలమేఘశ్యాముని చూస్తూ మనస్సును ఆ దివ్యమంగళ విగ్రహం మీదనే నిలిపారు.

**జలదస్వన గంభీరత**
**నెలుగొప్పగ దంతదీప్తు లెసగ**
**ముకుందుండలరు చెవుల**
**నఖిల జనంబులు విన**
**ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్ !!**
**జననాథ ! నీ యెరుంగని పనులు గలవె !**
**ఐన, దగవు పరమహితంబుం**
**తనవారికి జెప్పన తగునని వచ్చితి**
**భారతాన్వయము**
**ప్రియమొందన్**
**క్షీరోదక గతి**
**పాండవ కౌరవులొడగూడి మనికి**
**కార్యంబడి నీ వారసి నడపుము**
**వారన వీరన గురుముఖ్య**
**నీకు వేరుంగలదే!**

ఇక్కడ నుంచి వాసుదేవుని నోట వచ్చే ప్రతిశబ్దం మనసుంచి మననం చేసుకోవాలి, రాయబారి ఎంత సావధానంతో ఉండాలో గ్రహించాలి.

## హితంగా హితవు

(వాసుదేవుడు కురుసభా మందిరం ప్రవేశించి, ధృతరాష్ట్రాదుల నందరినీ అభినందించి, ఉచితాసనం మీద ఆసీనుడయ్యాడు. అప్పుడు సభాసదులందరూ తనవైపే చూపులు నిలిపివుండగా "జలదస్వన గంభీరత ఎలుగొప్పగా దంతదీప్తు లెసగ" ముకుందుడు ధృతరాష్ట్ర భూవిభునితో ఇట్లన్నాడు–)

"మహారాజా! ఇంతవరకు నీకు తెలియకుండా ఏ పనీ జరగలేదు. అన్నీ నీ ముందు జరిగినవే. ఈనాడు ఆప్తులకు హితవుచెప్పి న్యాయం చేకూరుద్దామని వచ్చాను. మీ భరత వంశానికది ప్రీతికరమని భావించాను. పాలూ, నీరూవలె (క్షీరనీర న్యాయం) పాండవులు, కౌరవులు కలిసి వుండడం మంచిది. ఆ పని నువ్వు చేయించాలి. వారూ వీరూ అనే భేదం నీకు లేదు" అని వాసుదేవుడు ఆరంభించాడు.

వాసుదేవుడు తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూనే నీవెరుగని పనులు లేవు అన్నాడు.

మహారాజుకు తెలియకుండా ఏ పనీ జరగదని పైకి సామాన్యంగా అర్థమవుతుంది. కాని భారతంలో రాజనీతిజ్ఞుడైన శ్రీకృష్ణుని నోట ఈ మాట వింటున్నప్పుడు మనం లోతుగా ఆలోచించాలి. అందులోను అలతి అలతి పదాలు తిక్కన్నగారు వాడుతున్నారంటే అందులో అనల్పార్థం ఉండి తీరుతుంది. ఇంతకుముందు ద్రౌపదీదేవి "అంతలు చేసి పొనడచి" అని ఒకమాట వదిలింది. అంతలు అన్న శబ్దం ఎంత అర్థాన్నిచ్చింది. నోటితో చెప్పకూడని అవమానాన్ని ధ్వనించడానికి అంత చిన్నశబ్దం వాడారు కవిబ్రహ్మ.

అలానే ఇక్కడ 'పనులు' అన్నప్పుడు చిన్ననాటి నుండీ కౌరవులు, పాండవులపై సాగించిన హింసాకార్యాలతో నిండుసభలో జరిపిన ద్రౌపదీ పరాభవం వరకు ఉన్నాయి. ఇటువంటి విషయాలు చెప్పేటప్పుడు తిక్కన్నగారు సర్వసామాన్యమైన చిన్న తెలుగుపలుకులు ప్రయోగిస్తారు.

ద్రౌపది మాట్లాడుతూ 'ఒకడు' నా జుట్టువట్టి లాగాడంటుంది. ఆ 'ఒకడి' పేరు పలకలేదు. ఈ ఏవురు చూడగా అని పాండవులు అనకుండా ఉత్తి సంఖ్య చెబుతుంది. అదీ తిక్కన్నగారి తీరు.

అది తెలియకపోతే భారతం తెలియదు.

అందుకే 'నీకు తెలియకుండా జరిగినదేమీ లేవు. అయినా హితబోధ చేద్దామని వచ్చాను' అంటున్నప్పుడు కృష్ణుని చూపులో విరసం ఉంటుంది.

"సింహాసనం మీద కూర్చుని నీ బిడ్డలు సాగించే అత్యాచారాలన్నీ ఆమోదించిన నీకు నేను హితబోధ చెయ్యడం నిష్ప్రయోజనం అని తెలిసి వచ్చాను. మీ వంశాన్ని ఉద్ధరిద్దామని.

"క్షీరనీరాలు – పాండవులు కౌరవులు"

ఇక్కడ సాహిత్యం, సంస్కారం కలవారందరికీ క్రమాలంకారం వినిపిస్తుంది.

"వారూ వీరూ అనే భేదభావం నీకున్నదా!" అని నిస్సందేహంగా నొక్కి చెబుతారు.

ఆ భావం ఎంత గాఢంగా ఉన్నదో ఆ సభలోని వారందరూ ఎరిగినదే. అయినా కృష్ణుడు ఎంత మృదువుగా, సామరస్య భావంతో మాట్లాడుతున్నాడూ అని వారు తలలూపకపోరు.

తిక్కన్నగారికి తెలుగుమీద ఉన్న ప్రీతిని చెప్పడానికి ఈ పద్యాలు ఉటంకించవచ్చు.

**(జననాథ! నీ ఎరుంగని పనులుగలవె!**

**ఐన తగవు పరమహితంబున్ తగ్గవారికి చెప్ప**

**తగునని వచ్చితి భారతాన్వయము**

**ప్రియమొందన్ క్షీరోదకగాలి పాండవ**

**కౌరవులొడగూడి మనకి కార్యంబది నీ వారసి**

**నడుపుము వారన వీరన**

**కౌరవముఖ్య ! నీకు వేరుంగలదే!)**

ఒకటి రెండు శబ్దాలు మినహాయిస్తే అన్నీ తెలుగుపదాలే. కానీ తెలుగు పదం శక్తి తెలిసిన సహృదయుడికి తప్ప ఈ మాటలలో ఎంతతూకం ఉన్నదో, ఎంత వ్యంగ్యంనిండి పొంగుతున్నదో తెలియదు. తెలుసుకోవాలనుకున్న వారికి గుండె పులకిస్తుంది.

"ఈనాడు దేశంలోని రాజవంశాలలో భరతవంశం సత్యధర్మ, న్యాయబద్ధమైనదని కీర్తిపొందింది. నువ్వూ మీ తమ్ముడూ ఆ కీర్తిని మరింత పెంచారు. నీ బిడ్డలు కూడా అంతటిశీలవంతులే. ఇప్పుడు కూడా ఆ కీర్తిని నిలబెట్టుకోవాలి.

"ఈ వంశానికి మూలాధారం నువ్వు. వీరిలో ఎవరికి కీడు జరిగినా మేలు కలిగినా అది నీవల్లనే అని గ్రహించి సోదరభావం పెంచుకుంటే ప్రజలు ప్రశంసిస్తారు.

"నీ కుమారులు, ధర్మం విడిచి పూర్వాపరాలు గ్రహించక వంశగౌరవం విస్మరించి క్రూరబుద్ధితో బంధుకోటికి కష్టం కలిగించే దుర్గుణాలతో ఉన్నారు. మీ ఉభయవంశాలూ విద్వేషాలు విడిచి శాంతంగా ఉంటే నీకూ నాకూ మన వంశానికీ మేలు. కాక యుద్ధం సిద్ధమైతే రాజవంశాలు విపత్సముద్రంలో పడతాయి. దృఢంగా సంకల్పిస్తే సంధిచేయడం నీకు అసాధ్యంకాదు. మీవారిని దారిలో పెట్టడం నీకు ఉచితమైన పని.

"భీమార్జునుల ఎదుట నిలిచి యుద్ధంచేసే వారెందరు! అలానే భీష్మ, ద్రోణుల ముందు ఆగగల వారెందరు! యుద్ధంలో ఇందరు యోధులు నేలకూలడంకంటే వారందరూ నీ అధీనంలో ఉండడం శ్రేయస్కరం కనుక సంధికి అంగీకరించమంటున్నాను. అలాకాక ఉపేక్షించావో ఈ పాపం నీ తలకు చుట్టుకోక తప్పదు. వారుకానీ, వీరుకానీ ఎవరు నిహతులైనా బాధపడవలసిందెవరు? నువ్వుకాదా! ఈ ప్రమాదం రాకుండా కాపాడితే నీ నీతిని, శాంతినీ లోకం కొనియాడుతుంది.

పాండవులు తండ్రి చచ్చిన ప్రజలు
వారి నరసి ప్రోచితి శైశవమాదిగాగ
నడుమ నిష్కారణమ దిగ విడువతగునె
పారమొందగ రక్షింపు గారవమున

పాండవులు తండ్రిలేని పిల్లలు. చిన్ననాడు వారిని చేరదీసి రక్షించిన వాడవు. అకారణంగా మధ్యలో విడిచిపెట్టావు. మించిపోలేదు. వారిని రక్షించి ఒక ఒడ్డుకు చేర్చు అని తన అభిప్రాయం స్పష్టంచేసి–

"మామా! పాండవులు నీకు ప్రణామాలు అర్పించి చెప్పమనిన మాటలు సావధానంగా విను."

"పన్నెండేళ్ళు అరణ్యాల్లో తిరిగి ఏడాది అజ్ఞాతవాసం చేసివస్తే మా రాజ్యభాగం మాకిస్తామన్నారు మీ మాట ప్రకారం ఆ పదమూడేళ్ళూ నిండాయి. మాకు తల్లి, తండ్రి బంధువు అన్నీ మీరే. మావల్ల ఏదైనా దోషం జరిగితే మందలించి దారిలో పెట్టుకోవాలి అని ఒకేమాటగా వారు నివేదించారు.

మరొక్కటి ఈ సదస్యులకు వినిపించమన్నారు.

**సారపు ధర్మమున్ విమల సత్యము**
**పాపముచేత బొంకుచే పారము పొందలేక**
**చెడబారిన దైన! యవస్థ**
**దక్షులెవ్వారలు పేక్ష చేసి రది**
**వారల చేటగుగాని ధర్మ నిస్తారక మయ్యు**
**సత్య శుభదాయక మయ్యును**
**దైవ ముండెడున్**

ధర్మమార్గాన నడిచేవారిని ఆధర్మపరులు హింసిస్తుంటే, సత్యాన్ని అణగద్రొక్కి అసత్యం ప్రభుత్వం సాగిస్తుంటే–

ఎదుర్కోగలిగిన దక్షత ఉండికూడా చూస్తూ ఊరుకునే వారిని ఆ పాపం కట్టి కుదుపుతుంది. ధర్మాన్నీ, సత్యాన్నీ నిలబెట్టడానికి దైవం ఉండనే ఉన్నాడు.

ఈ మాట చెబుతున్నప్పుడు కృష్ణుని కన్నులు భీష్మ, ద్రోణుల మీద ఉంటాయి సమర్థులై ఉండీ అత్యాచారాలను చూస్తూ వుండిపోయిన కారణంగా కురుక్షేత్రంలో వారు కూడా నిహతులు కాక తప్పదని చేసిన సూచన అది. అప్పుడైనా వారు తమ మనస్సు మార్చుకోవడానికి అవకాశం ఇచ్చాడు వాసుదేవుడు. అది జరిగే పని కాదని ఆయనకు తెలుసు. తెలిసినా తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించవలసిన బాధ్యతను మానవజాతికి తెలియజెప్పడానికే ఆ హితబోధ. రానున్న తరాల్లో అయినా భీష్మద్రోణుల వంటి దక్షులు అత్యాచారాలు సాగించేవారి వెంట ఉండకుండా లోకకల్యాణానికి నడుం కట్టాలని భారత సంహిత ఘోషిస్తున్నది.

మానవత్వ మర్యాదను నిలపడానికి మహాభారతం మేధావుల కర్తవ్యాన్ని అంత బలంగా ప్రబోధించినా నేటికీ అత్యాచారాలు జరిపే దుర్యోధనులను, దుశ్శాసనులను విడిచి ధర్మరక్షణకు నిలిచే సంస్కారం మనకు అలవడలేదు.

ఎట్టఎదుట అన్యాయాలు సాగుతుంటే కురుసభలో తలలు వంచుకు కూర్చున్న భీష్మద్రోణుల తత్వం మనలో చావకపోవడం మానవజాతి దురదృష్టం.

# వినకుంటే చెడతారు

కురువృద్ధ గురువృద్ధ బాంధువులందరూ కొలువుదీరివున్న సభామంటపంలో వాసుదేవుడు పాండవుల సందేశం వినిపింపజేశాడు ధృతరాష్ట్రునికి ప్రత్యేకంగా హితబోధ చేశాడు. సంధి చేసుకొంటే ఇరుపక్షాలు శాంతి సౌఖ్యాలతో మనగలవని అంటూ యుద్ధంవల్ల కలిగే అనర్థాలను కూడా తెలియజేశాడు.

ఆ తర్వాత–

“మహారాజా! పాండవుల అభిప్రాయం విన్నారు మీరందరూ. ధర్మాన్నీ, నీతినీ తప్పకుండా త్రికరణశుద్ధిగా సత్యం చెప్పాను. క్రోధరహితులై, మాత్సర్యం విడిచి, దురభిమానదూరులై పాండవుల భాగం వారికి ఇవ్వడం కంటే ధర్మం ఉన్నదేమో ఆలోచించి పెద్దలు చెప్పవచ్చు.

మహారాజా! పాండురాజు పరాక్రమంతో గెలిచిన రాజ్యం పాండవులకిచ్చి మీ రాజ్యం మీరు అనుభవించండి. దీనిని మన బంధువులూ, మిత్రులూ హర్షిస్తారు.

ధర్మజుని ప్రజ్ఞ ఎరుగుదువు, వారి ధర్మ నిష్ఠ తెలియనిది కాదు, వారి పరాక్రమం నేను చెప్పనవసరం లేదు. నిన్ను ఎంత గౌరవంతో సేవించే వారో మరొకరు వివరించాలా!

ఇంద్రప్రస్థంలో ఉండి వారు రాజులందరినీ జయించి నీకు సామంతులుగా చేశారు. అది ఓర్వలేక నీ బిడ్డలు (మేనమామ) శకునిని అడ్డుపెట్టి జూదం సాగించారు. సాగించి ఆగిపోతే యింత జరిగేది కాదు.

నిండు సభలో పాంచాలిని పరాభవించారు. అది సాగుతున్నా మీరు నోరెత్తి ఒక్కమాట మాట్లాడారా?

భీమార్జునులు అంత పరాక్రమ సంపన్నులై కూడా అన్నగారి ధర్మ వర్తనానికి తలవంచి కన్నీటితో కాననవాసానికి పోయారు.

అడవులలో అన్ని క్లేశాలూ పడ్డారు. ఇన్ని కష్టాలు మీరు కలిగించినా ధర్మరాజు నిర్మల హృదయంతో మీ యందు గురుభావం వదలక, సంధి చేసుకుని కలిసి మెలిసి ఉండడానికే నన్ను పంపించారు.

వినయం, శాంతచిత్తం, గౌరవభావం ధర్మరాజుకున్నంతగా ఎవరి కున్నాయి మామా? నేను ఇంతగా ఎందుకు మాట్లాడుతున్నానో తెలుసా!

మీ ఉభయ వంశాలూ ద్వేషం విడిచి సుఖంగా ఉంటాయని. నీ దుర్యోధనుని లోభగుణం అణచి పాండవులకు మరియాదగా మేలు చెయ్యి.

చివరగా ఒక్క మాట :

**వారలు శాంతశూరులు**
**భవచ్చరణంబులు గొల్వబూని**
**యున్నారటుగాక మీకది**
**మనంబున కప్రియమేనిన్**
**ఇంతకుం పోరికి వచ్చుచుండుదురు**
**భూవరా! రెండు తెరంగులందు**
**నీకారయ పథ్యమేదియగున్**
**అవ్విధ మేర్పడ నిశ్చయింపుమా !**

మహారాజా వారు శాంతశూరులు, నీ పాద సేవకు సిద్ధంగా ఉన్నారు, అందుకు మీరు అంగీకరించకపోతే యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

ఈ రెండిటిలో తమకు కావలసిన దానిని నిశ్చయించండి." అన్నాడు వాసుదేవుడు.

పాండవులు శాంతశూరులు అన్నాడు.

సాధారణంగా శూరునికి శాంతచిత్తం ఉండదు. తన పరాక్రమం కారణంగా అహంకారం ఆవహిస్తుంది. దానితో ఆవేశం విజృంభిస్తుంది. కాని పాండవులు ఆవేశానికి లొంగని శూరులు, ఆవేశం అనర్థహేతువు. ఎంతటి శూరుడైనా శాంత చిత్తంతో కార్యరంగంలో కాలుపెడితే విజయశ్రీ కైవసమవుతుందని నీతివేత్తల భాష్యం, అదీ కృష్ణుని మాటలో అంతర్యం.

అనంతరం నారద, కణ్వ, పరశురాములు ఉపాఖ్యానాలతో దుర్యోధనునికి హితబోధ చేసినా దుర్యోధనుడు వినక అహంకారంతో నోటికి వచ్చినట్లు మాట్లాడగా,

కృష్ణుడు : "దుర్యోధనా మరోసారి చెపుతున్నా, పాండవులూ మీరు కలిసి మెలిసి ఉండడం మీకు శ్రేయస్కరం. కాదంటావా! పాండవులను జయించగలవారు ముల్లోకాలలో లేరు నీ వెంట వచ్చేరాజులందరూ భీమసేనుని గదాదండానికి ఎదురు నిలవలేరు. మీ యోధులలో అర్జునుని కెదురునిలిచే వాడెవడు? ఉంటే వానితో అర్జునుడు ద్వంద్వ యుద్ధం చేస్తాడు. అప్పుడు జన క్షయం ఉండదు. నిన్నగాక మొన్న గోగ్రహణంలో మీ యోధులందరినీ పారద్రోలిన అర్జునుని సాహస పరాక్రమాలు లోకం ఎరుగును.

అందుచేత "కన్న సంతానాన్నీ, తోడబుట్టిన సోదరులను, ఆప్తమిత్రులనూ సర్వనాశనం చేసుకున్నాడు దుర్యోధనుడు" అనే అపకీర్తికి తల ఒగ్గకు.

రాజ్యభారం మీ తండ్రి భుజస్కంధాలమీదనే ఉంటుంది. మీరూ పాండవులూ ఆయన సేవలో రాజభోగాలు అనుభవించండి. "సిరి రా మోకాలొడ్డడం వివేక లక్షణం కాదు." అని వాసుదేవుడు మౌనం వహించాడు.

ఈ మాటలలో కృష్ణుడు పాండవుల సాహస పరాక్రమాలు ప్రకటిస్తూనే, దుర్యోధనుని అవివేకాన్ని అక్షరాక్షరంలో నొక్కి చెప్పడం గమనించాలి.

అందులో ఎంత రాజనీతి ఉన్నదో తెలుసుకోగలిగితే యువతరానికి విషమ సమస్యలలో ఎలా వ్యవహారం నడుపుకోవాలో బోధ పడుతుంది.

## ప్రయత్నం ఆపకు....

రాయబారం విఫలం అయింది.

కృష్ణుడు పెద్దల దగ్గర సెలవు తీసుకుంటూ–

"ఇంతవరకూ జరిగింది మీరంతా విన్నారు. చూశారు. ఇప్పుడు మహారాజు తన చేతులలో ఏమీ లేదంటున్నాడు. ఇంక నేనిక్కడ చెయ్యగలిగింది లేదు. ఈ వృత్తాంతం ధర్మరాజుకు వివరించడం నా కర్తవ్యం, నాకు సెలవిప్పించండి" అని రథం మీద కుంతీదేవి ఇంటికి వెళ్ళి చెప్పవలసినది చెప్పి, ఆవిడకు నమస్కరించి, రథం ఎక్కుతూ,

"కర్ణా! నన్ను సాగనంపి తిరిగి వెదుదువుగాని, నాతో కొంతదూరం నీ రథం రానియ్యి" అన్నాడు.

ఉభయుల రథాలూ నగరం వెలుపల నదీ తీరం చేరాయి. అక్కడ రథం దిగి కర్ణుని భుజం మీద చెయ్యివేసి కొంతదూరం నడిపించి :

"కర్ణా! ధర్మం తెలిసినవాడవు. వృద్ధులను సేవిస్తూ ధీమంతుడుగా పేరు తెచ్చుకున్న నీతో కొంత ముచ్చటించాలని పిలిచాను, సావధానంగా విను'" అని ఆరంభించాడు.

"ధర్మ సంవేదివి, వృద్ధ జనోపసేవివి" అని ప్రశంసించి కర్ణుని మంచితనాన్ని ప్రస్తావించాడు.

అదీ వ్యవహార దక్షత.

ఇంతకాలం పాండవులకు జరిగిన అన్యాయాలకు కర్ణుడూ బాధ్యుడే, అయినా ఆ విషయం ప్రస్తావించలేదు. పైగా ధర్మం తెలిసినవాడవు అనడంలో తను చెప్పబోయే విషయాలు జాగరూకతతో కర్ణుడు గ్రహించాలని ఆయన భావం.

మహాభారతంలో ఈ సన్నివేశం మానవజాతికి అవశ్య స్మరణీయం. మనిషి మనిషిగా జీవించి, దివ్యత్వం వైపు సాగడానికి అవసరమయిన మార్గం ఇక్కడ బోధిస్తున్నది మహాభారత ధర్మసంహిత.

అందుచేత మరింత మనసుంచి ఈ దృశ్యాన్ని మనసులో నిలపండి. ఉభయుల మాటలూ పరిశీలించండి.

"చిన్ననాడు కుంతీదేవికి సిద్ధించిన మంత్ర ప్రభావంవల్ల సూర్యుని అనుగ్రహంతో పుట్టినవాడివి. అంటే పాండురాజు కుమారులలో జ్యేష్ఠుడివి. ఇది ధర్మశాస్త్ర ప్రమాణం.

ఇప్పుడీ విషయం నేను తెలియజేస్తాను, నా మాట వింటూనే ధర్మరాజాదులు నీ పాదసేవ చేస్తారు. బంధుమిత్రులందరూ నిన్ను సింహాసనం ఎక్కిస్తారు. నేను పట్టాభిషేకం జరుపుతాను.

ధర్మరాజు నీ రథం మీద వింజామరలతో నిలబడతాడు.

భీమసేనుడు శ్వేత ఛత్రం పడతాడు, అర్జునుడు రథసారధిగా ఉంటాడు. పాంచాల యాదవ పాండ్య మత్స్య దేశాధిపతులతో నకుల సహదేవులు, అభిమన్యు ప్రభృతి కుమారులు జయజయధ్వానాలు చేస్తారు.

మహేంద్ర వైభవంతో మహీపతివై విరాజిల్లు.

మరొక్కమాట

నాడు ద్రౌపదీ స్వయంవర వేళ నువ్వూ ధనుస్సు సంధించబోయావు. ఈనాటికింకా నీకు ఆమె యందు మనసుంటే చెప్పు.

పాంచాల రాజపుత్రియున్

అంచితముగ నిన్ను పొందు

ఆర్వుర వరుసన్-

సంచిత పుణ్యుడ

వీవొక యించుకయును

వేరుచేయకే తెమ్మెలమిన్"

ఇది జరిగితే మీ అమ్మ కుంతి సంతోషిస్తుంది. ఆమెతో మిగిలిన బంధుమిత్రులు సంతోషిస్తారు.

చెప్పవలసినది చెప్పి మీ అమ్మ సంతోషిస్తుంది, అనడంలో ఉంది విశేషం.

ఎంతటి వారికయినా కన్నతల్లి మీద ఎటువంటి అభిమానం ఉంటుందో, ఆ తల్లి సంతోషం కోసం ఎన్ని సాహసాలు చేస్తారో ఎరిగిన గుండెతో వాసుదేవుడాడిన మాటలు విన్నాం.

సామ్రాజ్యం, సౌందర్యరాసి ద్రౌపది రెండూ అనాయాసంగా లభిస్తున్నాయి. కాంతా కనకాలకు ఆశపడే వాడెవడైనా కృష్ణుడు చెప్పిన దానికి అంగీకరిస్తే ఎంత సుఖపడతారు.

ఈ ఉపకారానికి ఫలంగా ఆయన పాలరాతి విగ్రహాన్ని పడకగదిలో పెట్టుకుని ప్రాతఃకాలంలో ఆ పాదాల మీద పారిజాతాలుంచి నిత్యం దాని ముందు తలవంచినా ఆ రుణం తీరదు.

కాని-

కర్ణుడు ఆనాడు అంగీకరించి ఉంటే మహాభారతంలోనే కాదు మానవజాతి బ్రతికి

ఉన్నంతకాలం "అంతటి కృతఘ్నుడు, విశ్వాస ఘాతుకుడు, స్వామి ద్రోహి ఉండడు" అని నిందిస్తూనే ఉండేది.

అంగీకరించకపోవడానికి కారణాలు చెపుతున్నారు కర్ణుడు!

వాసుదేవా !

''కుంతీదేవి చిన్ననాడు నన్ను కని గంగలో విడిచిందని చాటుమాటుగా వింటున్నానయ్యా!

అయితే సూతుడు నన్ను తెచ్చి తన భార్యకిచ్చిన నాటి నుంచి ఈ ఇల్లాలు నన్ను కన్నబిడ్డలా చూసుకున్నదయ్యా!

**మూత్ర పురీషాదులు**
**తమ గాత్రము లందింక**
**వారు గారవ మెసగన్**
**పుత్రుండని సంవర్ధిత**
**గాత్రునిగా చేసిరింత కాలము కూర్మిన్**

నా మలమూత్రాలు వారి శరీరాలమీద ఇంకిపోయాయి. అంత గారాబంగా పెంచి ఇంతకాలం నన్ను కన్నబిడ్డలా చూసుకున్నారు. ఇప్పుడు వారిని విడిచి వస్తే లోకం ఏమంటుందయ్యా!

ధర్మసంవేదిననీ, వృద్ధోపసేవిననీ అన్నావు.

నాకు జాతకర్మాది సంస్కారాలు జరిపిన వారికి పుత్రుడుగా నిర్వర్తించవలసిన ధర్మకర్మలు నేను చేయనవసరం లేదా!

ధర్మం ఆచరించని వాడికి ధర్మం తెలిసి ప్రయోజనం ఏమున్నది కృష్ణా! ఇది మొదటి కారణం నీ మాటను అంగీకరించకపోవడానికి.

## ఇందులో లేనిది వుందా?!

హస్తినలో రాయబారం విఫలమైంది. కర్ణునితో రహస్య మంతనాలూ ఫలించలేదు. ఇక యుద్ధానికి సన్నద్ధం కావడం తప్పనిసరి. యుద్ధంలో జరుగబోయే నష్టం ఎటువంటిదో కౌరవులను హెచ్చరించి వాసుదేవుడు తిరిగి ఉపప్లావ్యం చేరుకున్నాడు.

అక్కడ కృష్ణుడు పాండవులను సమీపించి తన రాయబార విశేషాలు ఎలా వినిపించాడో చూస్తే, సంజయుడెలా నడిచాడో చూశాం కనక ఉభయుల దృష్టి తెలుస్తుంది.

**కయ్యము కాని తెరంగున**
**నెయ్యం బగునట్లు గాగ**

**నెరి పలికితి నేనెయ్యది**
**సుఖంబు పథ్యం బెయ్యది**
**ఎరుగంగ తథ్య మెయ్యది దానిన్**

కృష్ణుని ప్రసంగ ప్రారంభం చూశారుగా

"యుద్ధం లేకుండా వారూ మీరూ స్నేహంతో ఉండడానికి అనుగుణంగా చెప్పవలసినంత చెప్పాను. సుఖంగా ఉండే దారి చూపించాను" అన్నాడు.

"ధర్మరాజు శాంతి సంధించమన్నాడు. అందుకు అనుగుణంగా మాట్లాడి వచ్చా" నన్నాడు. అంతతో ఆగలేదు.

"బావా! నేను మాట్లాడుతున్నంతసేపూ దుర్యోధనుడు కళ్ళు చికిలిస్తూ వంకర మాటలు మాట్లాడాడు.

ధృతరాష్ట్రుడు మందలించాడు.

తాను జాత్యంధుడు కావడం మూలాన పాండురాజు పరిపాలన సాగించాడనీ, అనంతరం మీరు వంశగౌరవంనిలుపుతూ దిగ్విజయయాత్రలు జరిపి సాధించిన సంపదలన్నీ వారు మోసంచేసి స్వాధీనం చేసుకున్నారనీ, ధర్మానికి కట్టుబడి మీరు అరణ్యవాసం, అజ్ఞాతవాసం ముగించి వచ్చాక మీ రాజ్యం మీకివ్వడం ధర్మమని అక్కడ సభలో పెద్దలు అందరూ బోధించారు.

ఆగ్రహంతో వారు తన మిత్రులను తీసుకుని సభనుంచి వెళ్ళిపోయాడు. గాంధారిని రప్పించి దుర్యోధనునికి మళ్ళీ హితవు చెప్పించారు.

ఆవిడ కంటతడిపెట్టి సంధివల్ల జరిగే మేలు చెప్పింది. ఎవరు చెప్పినా వాడు వినకుండా తన యోధులను కురుక్షేత్రానికి నడిపించాడు.

"నేను నెమ్మదిగా చెప్పాను, కోపం తెచ్చుకుని భయపెట్టాను, తృణీకారం చేశాను. మరోసారి ప్రయత్నిద్దామని శాంతంతో మృదువుగా మాట్లాడాను.

వాడు దుర్జనుడు కనక నన్ను బంధించడానికి రాబోగా కొన్ని ఇంద్రజాలాలు చేశాను. ఎలా అయినా సంధి జరగాలని తాపత్రయ పడ్డాను.

'పొరలం గల యంతయు పొరలితి' అన్నారు తిక్కనగారు. ఈ జాతీయంతో కృష్ణుని ప్రయత్నం అంతా వ్యక్తం అవుతుంది.

* * *

"ఆ పాపాత్ముడు మొండిపట్టు వదలలేదు రాజ్యం ఇవ్వడానికే కాదు, అయిదు గ్రామాలివ్వడానికి కూడా అంగీకరించలేదు. ఇంక దండనీతి తప్ప దారిలేదు. ఆలోచించండి అన్నదమ్ములు, మీ అమ్మ కుంతీదేవి కూడా యుద్ధం రాజధర్మం అని సందేశమిచ్చింది" అని ముగించాడు.

ఇక్కడితో రాయబారం ముగిసింది.

సంజయుని మాటలు విన్నాం, కృష్ణుని ప్రసంగమూ ఆలకించాం.

ఇంతకుముందు ద్రుపద పురోహితుడు, యుద్ధప్రారంభవేళ శకుని కొడుకు ఉలూకుడు రాయబారం నడిపాడు.

ఆ ఉభయులకూ రాజనీతి తెలియదు. ద్రుపద పురోహితుడు అధర్మాన్ని సహించలేక ఆవేశంతో మాట్లాడితే, ఉలూకుడు ధర్మాన్ని దర్శించలేక నోటికొచ్చిన కూతలు కూశాడు.

వాస్తవానికి రాయబారులుగా నిలిచేవారు సంజయుడూ, కృష్ణుడూ ఇద్దరే.

ఇందులో సంజయుని పద్ధతి లోకసహజమైనది. వాసుదేవుడు అసాధారణుడు. అలానే సాగాయి వారి ప్రసంగాలు.

ఈ దృష్టితో మహాభారతం అధ్యయనం చేయగలిగితే మనకు నీతి మార్గం అందుతుంది. మొత్తం భారతం చదవలేని వారు ఉద్యోగపర్వం అయినా శ్రద్ధగా అధ్యయనం చేస్తే లోకవ్యవహారం తెలుస్తుంది.

ఈ పర్వంలో విదురనీతి వున్నది, అది అన్ని దేశాలవారికీ అన్ని కాలాలలోనూ నిత్యజీవితాన్ని సుఖమయం చేసి లోకకళ్యాణం చేకూరుస్తుంది.

పారలౌకిక విషయాలకు సనత్సుజాతీయం ఉన్నది. ఇది భగవద్గీతను మించిన వేదాంత విషయంతో ఉంటుంది.

ఈ విధంగా రాజనీతి, లోకనీతి, పరమార్థచింతన మూడిటినీ అందించే ఈ పర్వాన్ని మనసుపెట్టి చదవండి, పిల్లలచేత చదివించండి.

లోకంలో ఉత్తములనే పేరు పొందుతారు. అదీ ఈ శ్రమకుఫలం, అందుకే మహర్షి వ్యాసులకు అంజలించాలి, కవిత్రయానికి కై మోడ్పు ఘటించాలి.

## ఉషశ్రీ ముద్రిత రచనలు

భారతం
రామాయణం
భాగవతం
సుందరకాండ
భగవద్గీత
ఉషశ్రీ ఉపన్యాసాలు
భారతంలో చిన్న కథలు
ధర్మ సందేహాలు
ఎవరు ఎలా మాట్లాడతారు?
*(భారతంలో రాయబారాలు)*
ఎవరితో ఎలా మాట్లాడాలి ?
*(రామాయణంలో హనుమంతుడు)*
వివేకానందం

పెళ్ళికొడుకులు (నాటకం)
రాగ హృదయం (నృత్యనాటిక)
వేంకటేశ్వర కళ్యాణం (యక్షగానం)
మల్లెపందిరి (సాంఘిక కథలు)
పెళ్ళాడే బొమ్మా (నవలా లేఖావళి)
జ్వలిత జ్వాల (నవలికలు)
అమృత కలశం (పౌరాణిక కథలు)
ప్రేయసీ ప్రియంవద (నవల)
సంతృప్తులు (నవల)
తరాలు - అంతరాలు (నవల)
కళాపూర్ణోదయం
మనుచరిత్ర.

# ఉషశ్రీ మిషన్

రామాయణ భారతాలు అందించే మానవత్వపు విలువలూ, సంస్కృతీ వైభవాలూ యువతరానికి తెలియజేయాలనే ఉషశ్రీ ఆకాంక్షే లక్ష్యంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది ఉషశ్రీ మిషన్


**మిషన్ కార్యక్రమాలు :**


- ఉషశ్రీ పుస్తకాలు ప్రచురించడం
- ఉషశ్రీ రామాయణ భారత ఉపన్యాసాలు సి.డి.లు, శ్రోతలకి అందించడం
- ushasri.org నిర్వహించడం.
- పాఠశాల, కళాశాలల విద్యార్థులకి రామాయణ భారతాలు అంశాలుగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, మన మహేతిహాసాల పట్ల వారిలో అవగాహన పెంచడం.
- భారతీయ సంస్కృతి, సాహిత్య రంగాలలో కృషి చేస్తున్న వారిలో ఏటా ఒకరిని 'ఉషశ్రీ సంస్కృతి సత్కారం'తో గౌరవించడం.

# ఉషశ్రీ మిషన్ ప్రచురణలు





మాటకి ఉన్న శక్తి ఏమిటో, ఎవరితో ఎలా మాట్లాడాలో వాగ్విదాంవరుడయిన హనుమంతుని ద్వారా నేర్చుకునే అవకాశం ప్రసాదించాడు వాల్మీకి మహర్షి. మహర్షి హృదయం "ఎవరితో ఎలా మాట్లాడాలి?" రూపంలో శ్రీ ఉషశ్రీ కలం నుండి తెలుగువారికి అందింది, అందుతూనే వుంది.

ఎవరు ఎలా మాట్లాడతారో, ఎప్పుడు ఎలా మాట్లాడతారో, ఎదుటి మనిషి మాటల్లోని అర్థాన్ని, అంతరార్థాన్ని ఎలా అర్థం చేసుకోవాలో నేటికి కూడా అన్వయించుకోగలిగేలా భారతం ఉద్యోగపర్వంలో అందించారు వ్యాస మహర్షి. మహర్షి అంతరంగాన్ని రేడియో వ్యాసుడు శ్రీ ఉషశ్రీ నేటి తరానికి అరటిపండు ఒలిచి ఇచ్చినట్లుగా అందించినదే ఈ "ఎవరు ఎలా మాట్లాడతారు?" (భారతంలో రాయబారాలు.)